ఆదివారం
28-05-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 335
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకుందాం

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలుగా ముందుకెళ్లాలని, తమ సంప్రదాయ మైత్రిని, సహకార బంధాన్ని మరింత బలపర్చుకోవాలని చైనా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ది కాంగో (డీఆర్‌సీ) సంకల్పించాయి.

2 లో

వచ్చేది కురుక్షేత్ర యుద్ధం

వైసీపీ కౌరవ సేనను ఓడిద్దాం

రాజధాని లేని రాష్ట్రంగా మార్చిన ఏపీని కాపాడుకుందాం

మహానాడులో టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపు

గోదావరి తీరం పసుపుమయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :

వచ్చేది కురుక్షేత్రమేనని, ఆ యుద్ధంలో వైసీపీ కౌరవ సేనను చిత్తుగా ఓడించి శాసన సభను గౌరవ సభగా మార్చి అసెంబ్లీకి వెళదామని టీడీపీ అధినేత చంద్రబాబు పిలుపునిచ్చారు. రాజమహేంద్రవరం వేమగిరిలో తెలుగుదేశం పార్టీ మహానాడు శనివారం అట్టహాసంగా ప్రారంభమైంది. తెలుగు తమ్ముళ్లు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలిరావడంతో గోదావరి తీరం పసుపుమయంగా మారింది. తొలుత మహానాడు వేదికపై ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నేతలు పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రతినిధుల సభను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడుతూ ఈ మహానాడు ప్రత్యేకమైనదని, ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాన్ని కూడా కలిపి నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తెలుగుజాతి గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన నాయకుడు ఎన్టీఆర్ అని, అలాంటి మహానాయకుడికి మనం వారసులమన్నారు. రాజమహేంద్రవరం ఎన్టీఆర్ మెచ్చిన నగరం. తెలుగు సంస్కృతీసాంప్రదాయాలకు రాజమహేంద్రవరం వేదిక. నన్నయ... ఇక్కడే నడయాడాడు... కందుకూరి వీరేశలింగం ఇక్కడే పుట్టాడు. ఇక్కడే కాటన్ నివసించాడు... ఈ ప్రాంతానికి సాగునీరు ఇచ్చాడు. కాటన్ చేసిన సేవలకు గాను ప్రతి ఊళ్లో ఆయన విగ్రహాలు ఉన్నాయి. ఇది ఆయనకు దక్కిన గౌరవమన్నారు. ఎన్టీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని తెలుగు జాతిని ప్రపంచంలో అగ్రస్థానంలో నిలబెట్టేందుకు సంకల్పం తీసుకుందామని పిలుపునిచ్చారు. రాష్ట్ర నాశనమే లక్ష్యంగా వైసీపీ ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని చంద్రబాబు విమర్శించారు. 2019లో ఏపీ ఆదాయం రూ.66,786 కోట్లు కాగా తెలంగాణది రూ.69,620 కోట్లని తెలిపారు. అదే 2022-23 నాటికి తెలంగాణ ఆదాయం రూ.1.32 లక్షల కోట్లు అయితే ఏపీ ఆదాయం కేవలం రూ.94,916 కోట్లు మాత్రమేనన్నారు. ఆనాడు సమానంగా ఉన్న ఆదాయం జగన్ పాలనతో తగ్గిందని, అది కూడా దాదాపు 40 శాతం అధికంగా తెలంగాణ ఆదాయం ఉందన్నారు. జగన్ విధ్వంస పాలనతో రాష్ట్ర ఆదాయం పూర్తిగా దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని మళ్లీ కాపాడే బాధ్యత టీడీపీ తీసుకుంటుందని చెప్పారు. 'రాష్ట్రంలో అభివృద్ధి ఆగిపోయింది. పోలవరం ప్రాజెక్టు, అమరావతి అభివృద్ధిని ఆపేశారు. అమరావతి, పోలవరం పూర్తయితే ఏపీ కూడా కళకళలాడేది. అనుభవం లేని వ్యక్తి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశాడు. పేదలను మరింత నిరుపేదలను చేస్తున్నారు. నాలుగేళ్లలో కార్యకర్తలు ఎన్నో త్యాగాలు చేశారు. అరెస్టులు, కేసులు, దాడులకు ఏ ఒక్క నాయకుడు భయపడలేదు. అనేక సవాళ్లను ఎదుర్కొని తెలుగుదేశం కార్యకర్తలు నిలబడ్డారు. మీ అందరి త్యాగాలకు సెల్యూట్ చేస్తున్నా. శిరస్సు వంచి మీకు పాదాభివందనం చేస్తున్నా. భవిష్యత్‌లో మిమ్మల్ని ఆదుకునే బాధ్యత నాది అని తెలుగు తమ్ముళ్లకు భరోసా ఇచ్చారు. సంపద సృష్టించడమే కాదు... పంచడం కూడా తెలిసిన పార్టీ తెలుగు దేశం పార్టీ. ఏపీలో సంక్షేమ పథకాలు మొదలు పెట్టిందే తెలుగుదేశం. రెండు రూపాయలకు కిలో బియ్యం, రైతులకు రూ.50 హార్స్ పవర్ విద్యుత్ ఇచ్చాం. దేశంలో మొదటి సారి పేదలకు పెన్షన్ ఇచ్చిన పార్టీ టీడీపీ. 2014లో రూ.200 పెన్షన్ ఉంటే రూ.2,000 చేసిన పార్టీ తెలుగుదేశం పార్టీ. 2014 తరువాత వందల సంఖ్యలో పథకాలు అమలు చేశాం. హైదరాబాద్ నగరాన్ని మనమే అభివృద్ధి చేశాం. విభజన తరువాత 2029 నాటికి ఏపీని కూడా దేశంలో నంబర్ 1 రాష్ట్రం చేయాలని పనులు చేశాం. వ్యవసాయంలో 11 శాతం వృద్ధి రేటు సాధించాం. ఇరిగేషన్ పై 64 వేల కోట్లు ఖర్చు చేశాం. రూ.16 లక్షల కోట్ల విలువైన

- మిగతా 2 లో

పార్లమెంటు కొత్త భవనం
నేడే ప్రారంభం

సర్వం సిద్ధం- కట్టుదిట్టమైన భద్రత

ఏకపక్షంగా ముందుకెళుతున్న మోదీ

న్యూఢిల్లీ:

పార్లమెంటు కొత్త భవన ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది. వైభవంగా వేడుక నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. రాష్ట్రపతికి బదులు ప్రధాని ఈ భవనాన్ని ప్రారంభించడాన్ని 20 ప్రతిపక్ష పార్టీలు ముక్తకంఠంతో వ్యతిరేకించాయి. రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ రాష్ట్రపతి హక్కును నిరాకరిస్తూ ఏకపక్షంగా మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించాయి. ప్రారంభోత్సవాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించాయి. రాజదండాన్ని ప్రతిష్టించనుండటం కూడా వివాదాస్పదమైంది. నాడు బ్రిటీష్ నుంచి అధికార బదిలీకి చిహ్నంగా రాజదండాన్ని నూతన పార్లమెంటులో పెట్టాలని కేంద్రం భావిస్తోంది. దీనిని కాంగ్రెస్‌తో సహా ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. ఇది రాచరిక వ్యవస్థ కాదన్నాయి. బ్రిటీష్ నుంచి భారత్‌కు అధికార బదిలీకి చిహ్నంగా రాజదండాన్ని ఇచ్చినట్లు లార్డ్ మౌంట్‌బాటెన్, సి.రాజగోపాలాచారి, జవహర్ లాల్ నెహ్రూ ధ్రువీకరించినట్లు ఎలాంటి

- మిగతా 2 లో

పార్లమెంటు భవన ప్రారంభోత్సవాన్ని ఆపండి: నారాయణ

2 లో

అవినాశ్ రెడ్డికి ఉపశమనం

ముందస్తు బెయిల్‌పై తీర్పు 31కి వాయిదా

అప్పటివరకు అరెస్ట్ చేయొద్దని సీబీఐకి హైకోర్టు ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బాబాయి వివేకానంద రెడ్డి హత్య కేసులో సీబీఐ విచారణను ఎదుర్కొంటూ తీవ్ర ఉత్కంఠతకు గురవుతున్న ఎంపీ అవినాశ్ రెడ్డికి తెలంగాణ హైకోర్టులో ఉపశమనం లభించింది. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై రెండు రోజులుగా వాడివేడిగా సాగుతున్న సుదీర్ఘ వాదనలు శనివారం ముగిశాయి. వాదనలు విన్న వెకేషన్ బెంచ్ న్యాయమూర్తి జస్టిస్ ఎం.లక్ష్మణ్ బెయిల్ పిటిషన్‌పై తీర్పును ఈ నెల 31కి వాయిదా వేశారు. అప్పటివరకు అవినాశ్ రెడ్డిని అరెస్ట్ చేయవద్దని సీబీఐ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అవినాశ్ రెడ్డి, వివేకా కుమార్తె సునీత తరఫు న్యాయవాదులు కోర్టుకు వాదనలు వినిపించగా, శనివారం సీబీఐ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనిల్ వాదనలు వినిపించారు. అవినాశ్ రెడ్డి విచారణకు ఏమాత్రం సహకరించడం లేదని, కేసు దర్యాప్తులో మొదటి నుంచి అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దర్యాప్తు మా పద్ధతి ప్రకారం చేస్తాం కానీ, అవినాశ్ కోరుకున్నట్లు కాదు. దర్యాప్తును జాప్యం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారు. నోటీసు ఇచ్చిన ప్రతిసారి ఏదో ఒక కారణం చెప్పి విచారణకు హాజరుకావడం లేదు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటివరకు ఎంతో మందిని విచారించాం. కొందరిని అరెస్టు చేశాం. మిగతావారికి లేని ప్రత్యేక పరిస్థితి అవినాశ్‌కు ఏమిటి? కోర్టుల్లో రకరకాల పిటిషన్లు వేస్తూ జాప్యం చేస్తున్నారని సీబీఐ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. సామాన్యుల కేసుల్లోనూ ఇంత సమయం తీసుకుంటారా? అని సీబీఐ తరఫు న్యాయవాదిని హైకోర్టు ప్రశ్నించింది. వివేకా హత్యకు అనేక ఉద్దేశాలు చెబుతున్నారని, ప్రధాన కారణమేంటి?అని ప్రశ్నించింది. దీనిపై సీబీఐ స్పందిస్తూ "రాజకీయ ఉద్దేశాలే వివేకా హత్యకు ప్రధాన కారణం. హత్యకు నెల రోజుల ముందు నుంచే కుట్ర ప్రారంభమైంది. అవినాశ్ కుటుంబానికి వివేకాతో రాజకీయ విభేదాలున్నాయి. కడప ఎంపీ టికెట్ విజయమ్మ

- మిగతా 2 లో

పరాకాష్ఠకు కేంద్రం ఆగడాలు

- ▸ సుప్రీం తీర్పును కాలరాసేలా ఆర్డినెన్స్
- ▸ ఆప్ సర్కారుకు అండగా ఉంటాం
- ▸ కేజ్రీవాల్‌కు కేసీఆర్ హామీ

విశాలాంధ్ర-హైదరాబాద్:

దేశంలో మోదీ ప్రభుత్వం ఆగడాలు, అరాచకాలు మితిమీరి...పరాకాష్ఠకు చేరాయని బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను ముప్పుతిప్పలు పెడుతూ పని చేయనీయడం లేదని మండిపడ్డారు. ప్రగతిభవన్‌లో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్ శనివారం కేసీఆర్‌తో భేటీ అయ్యారు. దేశ రాజకీయాలు, మోదీ సర్కారు తీసుకొచ్చిన ఆర్డినెన్స్ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ మోదీ సర్కారు రాష్ట్రాలలో బీజేపీ యేతర ప్రభుత్వాలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నదని విమర్శించారు. ఆర్థిక వ్యవహారాల్లో పరిమితులు విధించడం, రకరకాల దాడులు చేస్తూ వేధించడం, అనేక రకాల దుర్మార్గాలకు మోదీ ప్రభుత్వం ఒడిగడుతోందని, దీనిని దేశమంతా చూస్తున్నదని కేసీఆర్ చెప్పారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీకి అత్యంత ప్రజాదరణ ఉన్నదని, ఓ సామాజిక ఉద్యమం నుంచి అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలో ఏర్పడిన పార్టీ ఆప్ అని కొనియాడారు. సుప్రీంకోర్టు ఆదేశాలను సైతం మోదీ సర్కారు బేఖాతరు చేస్తున్నదని మండిపడ్డారు. ఢిల్లీ మేయర్ ఎన్నికను సైతం నెలల తరబడి అడ్డుకున్నదని గుర్తుచేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ఊపిరాడకుండా దుర్మార్గ చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల పోస్టింగ్, బదిలీలకు సంబంధించి కేజ్రీవాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా... సీజేఐతో కూడిన ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఆప్ సర్కారుకు అనుకూలంగా స్పష్టమైన తీర్పు ఇచ్చిందని తెలిపారు. ప్రజాప్రభుత్వానికే సర్వాధికారులు ఉంటాయని, అధికారులు సైతం రాష్ట్ర ప్రభుత్వం చెప్పుచేతల్లోనే పనిచేయాలని స్పష్టం చేసిందన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌కు మితిమీరిన అధికారాలేవీ ఉండవని చెప్పిందన్నారు. ప్రజా ప్రభుత్వాన్ని పనిచేయనీయకపోవడమే అరాచకమని, దానిపై లెఫ్టినెంట్ గవర్నరును కూర్చోబెట్టడం నియంతృత్వ వైఖరికి నిదర్శనమని కేసీఆర్ విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పును కాలరాసేలా భయంకర ఆర్డినెన్స్ తీసుకురావడం మోదీ దుర్మార్గానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మోదీ సర్కారు తీరును చూస్తే ఎమర్జెన్సీ రోజులు గుర్తుకొస్తున్నాయన్నారు. ఏ ఎమర్జెన్సీ గురించి నరేంద్ర మోదీ, బీజేపీ నాయకులు గొంతుచించుకున్నారో... ఇప్పుడు ఇదే జరుగుతున్నదని చెప్పారు. ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇవ్వడంతో ఎమర్జెన్సీ వచ్చిందని, ఇప్పుడు కేజ్రీవాల్ ప్రభుత్వానికి అనుకూలంగా సుప్రం తీర్పు ఇవ్వడంతో మోదీ సర్కారు అలాగే వ్యవహరిస్తోందని

- మిగతా 2 లో

'నీతిఆయోగ్'కు 10 మంది సీఎంలు గైర్హాజరు

న్యూఢిల్లీ:

ప్రధాని మోదీ అధ్యక్షతన నీతిఆయోగ్ ఎనిమిదవ సమావేశం జరిగింది. ఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లోగల కన్వెన్షన్ సెంటర్‌లో 'వికసిత్ భారత్ ఎట్ 2047' థీమ్‌తో దీనిని నిర్వహించారు. సమావేశానికి పది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరయ్యారు. ఢిల్లీ, పంజాబ్, పశ్చిమ బెంగాల్, బీహార్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్నాటక, రాజస్థాన్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులు తాము రాలేమని సమాచారమిచ్చారు. ఢిల్లీ ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసులు, బదిలీల విషయమై కేంద్రప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చిన నేపథ్యంలో నీతి ఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రకటించారు. దేశంలో

- మిగతా 2 లో

ప్రపంచ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులు పోటీపడాలంటే రవాణా వ్యయం తగ్గాలి

3 లో

ఇదీ లోకం!

సార్, ఈయన మన పార్టీ విధానాలు ఉత్తుత్తి పథకాలు నచ్చి చేరతాడట తీసుకొచ్చేస్తున్నా!

పోలవరం పెండింగ్ నిధులు ఇవ్వండి

కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు సీఎం జగన్ వినతి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి :

పోలవరం ప్రాజెక్టు సవరించిన అంచనా వ్యయం నిధులు సహా పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌తో ముఖ్యమంత్రి శనివారం సాయంత్రం ఢిల్లీలో భేటీ అయ్యారు. సుమారు అరగంటపాటు వీరిద్దరి సమావేశం కొనసాగింది. పోలవరంతోపాటు, రాష్ట్రంలో జలవనరుల శాఖకు సంబంధించిన సమస్యలను సీఎం ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన నిధులు సత్వరమే ఇప్పించాలని కోరారు. ప్రాజెక్టుకు పెరిగిన అంచనా వ్యయాన్ని ఆమోదించి నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు పునరావాస బాధితులను ఆదుకోవడానికి పెద్దమొత్తంలో ఖర్చు అవుతుందని వివరించారు. సీఎం చెప్పిన అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా

స్పందించారు. మూడు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం శుక్రవారం సాయంత్రం కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో సుమారు 40 నిమిషాలు భేటీ అయ్యారు. నాడు-నేడు పథకం ద్వారా విద్య, ఆరోగ్య రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఖర్చును క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (మూలధన పెట్టుబడి)గా భావించి ప్రత్యేక సాయం వర్తింప చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రజల

- మిగతా 2 లో

రాష్ట్రపతిని అవమానించడం తగదు

- ▸ అమిత్‌షా, జగన్ జేబు సంస్థ సీబీఐ
- ▸ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- కడప:

ప్రపంచాన్ని విస్తుగొలిపే సంఘటనలు భారతదేశంలో జరుగుతున్నాయని, ముఖ్యంగా నూతన పార్లమెంటు భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము లేకుండా ప్రారంభించడం విస్మయంతో పాటు ఆశ్చర్యం కలిగిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. స్వతంత్ర ప్రతిపత్తి గల దర్యాప్తు సంస్థ సీబీఐ కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఏపీ సీఎం జగన్ జేబు సంస్థగా మారిందని వ్యాఖ్యానించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడారు. అనేక బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందుతాయని, చివరికి రాష్ట్రపతి సంతకంతోనే చట్టాలుగా మారతాయని రామకృష్ణ చెప్పారు. ఇంతటి ప్రాధాన్యత గల రాష్ట్రపతికి మోదీ సర్కారు విలువ ఇవ్వకపోవడాన్ని క్షమించరాని నేరంగా ఆయన అభివర్ణించారు. ద్రౌపది ముర్మును రాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటిస్తూ గిరిజన మహిళను రాష్ట్రపతిగా చేసే సత్తా బీజేపీకి మాత్రమే ఉందని గొప్పగా చెప్పుకున్నారని, ఇప్పుడు మాత్రం ఆమెను పరిగణనలోకి తీసుకోవడంలేదని మండిపడ్డారు. రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడాన్ని ప్రతిపక్షాలన్నీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయన్నారు. రాష్ట్రపతితో పార్లమెంటు భవనం ప్రారంభించాలని 21

- మిగతా 2 లో

సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంచుకుందాం

చైనా, కాంగో సంకల్పం

బీజింగ్: సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలుగా ముందుకెళ్లాలని, తమ సంప్రదాయ మైత్రిని, సహకార బంధాన్ని మరింత బలపర్చుకోవాలని చైనా, డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ ది కాంగో (డీఆర్‌సీ) సంకల్పించాయి. ద్వైపాక్షిక బంధాన్ని వ్యూహాత్మక భాగస్వామ్యంగా మల్చుకోవడం ద్వారా రెండు దేశాలకు ప్రయోజనమని నిర్ణయించాయి. చైనా, డీఆర్‌సీ సంప్రదాయ మిత్రదేశాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. చైనా పర్యటనలో ఉన్న డీఆర్‌సీ అధ్యక్షుడు ఫెలిక్స్ ఆంటోని షిసెకిడి షిలోంబోతో బీజింగ్‌లో జిన్‌పింగ్ భేటీ అయ్యారు. అనేక అంశాలపై చర్చించిన దేశాధినేతలు ద్వైపాక్షిక సహకారాన్ని మరిన్ని రంగాలకు విస్తరించాలని నిర్ణయించారు. డీఆర్‌సీతో తమ అభివృద్ధి వ్యూహాలను పంచుకునేందుకు చైనా సిద్ధంగా ఉన్నట్లు జిన్‌పింగ్ తెలిపారు. సహకారాన్ని, సంక్షేమాన్ని ప్రోత్సహిస్తామని అన్నారు. డీఆర్‌సీ అధ్యక్షుడు మాట్లాడుతూ, ఆర్థిక, వాణిజ్య, మౌలికవసతులు, వైద్యసంరక్షణ తదితర రంగాల్లో చైనాతో కలిసి పనిచేస్తామని, సహకారాన్ని పెంచుకోవాలని కాంగో భావిస్తోందని అన్నారు. తమ దేశాల ప్రయోజనాల దృష్ట్యా సమగ్ర వ్యూహాత్మక సుస్థిర సహకారం అవశ్యమని చెప్పారు. చర్చల అనంతరం ఇద్దరు ద్వైపాక్షిక సహకార ఒప్పందాలపై సంతకాలు చేశారు. డిజిటల్ ఎకానమీ, గ్రీన్ ఎకానమీ, పెట్టుబడులు తదితర రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్నారు. అంతముందు గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో డీఆర్‌సీ అధ్యక్షుడికి జిన్‌పింగ్ ఘనంగా స్వాగతిమచ్చారు. అనంతరం విందుకు ఆతిథ్యమిచ్చారు.

ఎర్డోగన్‌కు ఓటుతో 'నో' చెప్పండి

టర్కీ ప్రజలకు టీకేపీ పిలుపు

నేడే అధ్యక్ష మలిదశ ఎన్నికలు

అంకారా: టర్కీ అధ్యక్ష ఎన్నికల మలిదశ పోలింగ్ ఈనెల 28వ తేదీ(ఆదివారం) జరగబోతోంది. ఇందుకు ఆ దేశంలో ఏర్పాట్లు దాదాపు పూర్తి అయ్యాయి. ఇదే క్రమంలో నిరంకుశత్వానికి మారుపేరైన రిసెప్ తయ్యిప్ ఎర్డోగన్‌కు ఓటు ద్వారా 'నో' చెప్పాలని ప్రజలకు టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) పిలుపునిచ్చింది. అధ్యక్షుడు ఎర్డోగన్‌కు ఆయన ప్రత్యర్థి కెమెల్ కలిచ్దారోగ్లుకు మధ్య హోరాహోరీ పోరు జరగబోతోంది. వాస్తవానికి వీరి మధ్య టర్కీ గుత్తాధిపతుల ఎవరు ఎక్కువగా ఊడిగం చేయగలరన్న పోటీ ఉన్నది. దేశ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణను ఇద్దరూ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈనెల 14న జరిగిన మొదటిదశ పోలింగ్‌లో ఎర్డోగన్‌కు 49.5శాతం ఓట్లు రాగా ఆయన ప్రత్యర్థికి 44.9శాతం ఓట్లు పోలయ్యాయి. దేశంలో నిరంకుశ పరిపాలన, పెట్టుబడిదారీ వర్గానికి పెద్దపీట, ప్రజా ప్రయోజనలను తుంగలోకి తొక్కడం వంటివన్నీ దృష్టిలో పెట్టుకొని ఎర్డోగన్‌ను తిరస్కరించాలని కమ్యూనిస్టు పార్టీ పిలుపునిచ్చింది. 20 ఏళ్ల నిరంకుశ పాలనలో టర్కీ మహిళలు, యువత, కార్మికులు, దేశభక్తులు పడిన కష్టాలు అన్నిఇన్నీ కావని గుర్తుచేసింది. మంచి రోజులు వస్తాయన్న ఆశలు, ఆకాంక్షలను వృథా చేయొద్దని, ఎర్డోగన్‌ను బ్యాలెట్ బాక్స్‌లో సమాధి చేయాలని టర్కీ ప్రజలకు టీకేపీ పిలుపునిచ్చింది. ఫలితాలు ఎలాగున్నాగానీ 28న ఎర్డోగన్‌కు వ్యతిరేకంగా పడే ప్రతి ఓటు ఏకేపీని దెబ్బతీస్తుందని పేర్కొంది. 'ఎన్నికల్లో పాల్గొద్దాం. ఎర్డోగన్‌ను తరిమేద్దాం. నల్లచరిత్రలో భాగస్వాములైన ప్రతి ఒక్కరి లెక్క తేలుద్దాం. ఇది కొత్త ఆరంభం. పోరాటాన్ని ఆపొద్దు' అని టర్కీ ప్రజలకు టీకేపీ పిలుపునిచ్చింది.

31న భారత్‌కు ప్రచండ

ఖాట్మండు: నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ ఈనెల 31 నుంచి నాలుగు రోజుల పాటు భారత్‌లో పర్యటిస్తారు. భారత ప్రధాని నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు ఆయన భారత్‌లో పర్యటించనున్నారని నేపాల్ విదేశాంగ శాఖ ఒకప్రకటనలో తెలిపింది. మోదీని కలిసి ద్వైపాక్షిక సంబంధాల విస్తరణపై చర్చిస్తారని, ఇతర నాయకులతోనూ ఆయన భేటీ అవుతారని వెల్లడించింది. 2022 డిసెంబరులో నేపాల్ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రచండ (68) భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి కాగా ఆయన గతంలో మూడుసార్లు పర్యటించారు. ప్రచండ వెంట ఆయన తనయ గంగా దహల్, మంత్రులు, కార్యదర్శులు, ప్రభుత్వ సీనియర్ అధికారులు ఉంటారు. నేపాల్ బృందానికి ప్రధాని మోదీ విందు ఇస్తారని ప్రకటన తెలిపింది. ప్రచండ భారత్‌కు చేరుకున్నాక రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌ను మర్యాదపూర్వకంగా కలుస్తారని అధికారిక ప్రకటన పేర్కొంది. జూన్ 1న మోదీతో సమావేశం అనంతరం సంయుక్త విలేకరుల సమావేశాన్ని ఇద్దరు ప్రధానులు నిర్వహిస్తారని తెలిపింది. ఫెడరేషన్ ఆఫ్ నేపాలీస్ చాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ (ఎఫ్‌ఎన్‌సీసీఐ), కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) సంయుక్త అధ్వర్యంలో న్యూదిల్లీలో జరిగే నేపాల్-భారత్ వాణిజ్య సదస్సులో ప్రచండ పాల్గొంటారని, రెండు దేశాల వ్యాపారవేత్తలతో సంభాషిస్తారని పేర్కొంది. భారత్‌కు నేపాల్ రాయబారి ప్రసాద్ శర్మ ఏర్పాటు చేసే స్వాగతసభలో నేపాల్ సంతతి ప్రజలతో ప్రచండ ముచ్చటిస్తారని, ఉజ్జెయిన్, ఇండోర్‌నూ సందర్శిస్తారని తెలిపింది. జూన్ 3న ప్రచండ ఖాట్మండుకు పయనమవుతారని నేపాల్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

దీపావళి సెలవు కోసం అమెరికా కాంగ్రెస్‌లో బిల్లు

వాషింగ్టన్: దీపావళి పండుగను సెలవు దినంగా ప్రకటించాలని ప్రతిపాదిస్తూ అమెరికా ప్రతినిధుల సభలో బిల్లును ప్రవేశపెట్టారు. 'దీపావళి డే యాక్ట్' బిల్లును సభ్యురాలు గ్రేస్ మెంగ్ ప్రవేశపెట్టారు. న్యూయార్క్‌లోని క్వీన్స్ ప్రాంతంలోని చాలా వర్గాలు ఈ పండగను వైభవంగా జరుపుతాయని, దీపావళిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తే ఆయా వర్గీయులు తమ కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకునేందుకు వీలు కలుగుతుందని మెంగ్ వెల్లడించారు. అంతేకాకుండా భిన్నసంస్కృతులకు ప్రభుత్వం ఇచ్చే విలువను చాటుతుందని కూడా ఆమె పేర్కొన్నారు. ఈ బిల్లును ప్రతినిధుల సభ ఆమోదిస్తే అధ్యక్షుడి ఆమోదం కోసం పంపుతారు. ఆయన సంతకం చేస్తే అమెరికాలో దీపావళిని సెలవు దినంగా ప్రకటిస్తారు. అదే జరిగితే 12వ ప్రభుత్వ సెలవుగా దీపావళి ఉంటుంది. తాజా బిల్లును భారత సంతతి చట్టసభ్యులు, అనేక వర్గాల నేతలు స్వాగతించారు. దీపావళిని సెలవు దినంగా ప్రకటించాలని 2021లోనూ ప్రతినిధుల సభలో ఓ బిల్లును ప్రవేశపెట్టగా అనేక కారణాలతో అది కార్యరూపం దాల్చలేదు.

బ్రిజ్ భూషణ్‌ను కటకటాల వెనక్కి నెట్టాలి

యోగా గురువు బాబా రాందేవ్

జైపూర్ : భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను జైలులో పెట్టక తప్పదని, బీజేపీ ఎంపీ అయిన సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు సిగ్గుచేటని యోగా గురు బాబా రామ్‌దేవ్ అన్నారు. గత నెల రోజులుగా దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న రెజ్లర్లకు ఆయన మద్దతు ప్రకటించారు. రామ్‌దేవ్ శుక్రవారం భిల్వారాలో విలేకరులతో మాట్లాడుతూ అలాంటి వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కటకటాల వెనక్కి నెట్టాలని, మన తల్లులు, సోదరీమణులు, కూతుళ్ల గురించి ప్రతిరోజూ అర్థంపర్థం లేని మాటలు మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన నడుచుకుంటున్న తీరును చాలా ఖండించదగిన దుర్మార్గమైన చర్యగా, పాపంగా రాందేవ్ బాబా తెలిపారు. మూడు రోజుల యోగా శిబిరానికి హాజరయ్యేందుకు ఆయన భిల్వారా వచ్చారు. తాను ఎప్పటికీ రాజకీయాల్లోకి రానని, తనకు ఎవరితోనూ శత్రుత్వం లేదని తెలిపారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్‌ను ప్రశంసించారు. బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదయిన తర్వాత కూడా అరెస్టు చేయకపోవడంపై ప్రశ్నించగా, 'నేను ప్రకటన మాత్రమే ఇవ్వగలను. నేను అతన్ని జైల్లో పెట్టలేను కదా' అంటూ వ్యాఖ్యానించారు. 'రాజకీయంగా అన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పగలను. నేను మేధోపరంగా దివాళా తీయలేదు. మానసికంగా, మేధోపరంగా వికలాంగుడిని కాదు. దేశం కోసం నాకు విజన్ ఉంది' అని యోగా గురువు తెలిపారు.

రేపు 'సహకార భూమి' పక్షపత్రిక ఆవిష్కరణ

విశాలాంధ్ర - విజయవాడ : ప్రజల్లో సహకార స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు, సహకార రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా వస్తున్న 'సహకార భూమి' పక్ష పత్రికను ఈ నెల 29వ తేదీ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి ప్రారంభించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు దాసరి కేశవులు, పత్రి క ఎడిటర్ పాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా రెయిన్ ట్రీ పార్క్ విల్లా నెం:126లో సోమవారం సాయంత్రం 6 గంటలకు సహకార భూమి వ్యవస్థాపక చైర్మన్, కృష్ణా డీసీసీబీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగే ప్రారంభసభలో మంత్రి కాకాని ఆవిష్కరిస్తారని తెలిపారు. దీనికి ముందుగా విజయవాడ శ్యామ్ నగర్, కోపరేటివ్ కాలనీలోని సహకార భూమి కార్యాలయం వద్ద సాయంత్రం 4 గంటలకు లోగోను సి.రాఘవాచారి మీడియా అకాడమి చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, సహకార పతాకాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి, సహకార పితామహుడు వేమవరపు రామదాసు పంతులు చిత్రపటాన్ని సహకార ధర్మపీఠం హైదరాబాదుకు చెందిన సంభారపు భూమయ్య ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకారాభిమానులంతా పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయవల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

నేడే ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

పత్రాలు లేవని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తేల్చిచెప్పారు. మోదీ ప్రభుత్వ వైఖరిని దుయ్యబట్టారు. తాము లేవనెత్తే ఎలాంటి ప్రశ్నలకు సమాధానాలను కేంద్రం ఇవ్వదని, ప్రజాసమస్యలను పట్టించుకోదని, కీలకాంశాలను నిర్లక్ష్యం చేస్తున్నదని వామపక్షాలతో సహా విపక్షాలు ఘాటుగా విమర్శించాయి. రాష్ట్రపతికి మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశాయి. లేనిపక్షంలో బహిష్కరణ నిర్ణయాన్ని మార్చుకునేది లేదని స్పష్టంచేశాయి. ఇదిలావుంటే, పార్లమెంటు భవనాన్ని ప్రజాస్వామ్య ఆలయంగా ప్రధాని మోదీ వర్ణించారు. కొత్త పార్లమెంటు భవనం చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో విరివిగా పంచుకుంటూ మా పార్లమెంటు మాకు గర్వకారణం అని పోస్టులు పెట్టాలని కోరారు. భారతాభివృద్ధికి, కోట్లాది మంది సాధికారతకు ఈ ప్రజాస్వామ్య ఆలయం దోహదమవ్వాలని ఆకాంక్షించారు.

కార్యక్రమం వివరాలు

ఆదివారం ఉదయం 7.30 గంటలకు పూజ, హోమంతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత లోక్‌సభ చాంబర్‌లో రాజదండాన్ని స్థాపిస్తారు. సర్వమతాల ప్రార్థనల అనంతరం పార్లమెంటుపై రూపొందించిన రెండు లఘుచిత్రాలు ప్రదర్శిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు జాతీయ గీతాలాపనతో సభ మొదలవుతుంది. రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ప్రసంగిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ సందేశాలను చదివి వినిపిస్తారు. స్పీకర్ ఓం బిర్లా తదితరుల ప్రసంగాల తర్వాత రూ.75 నాణెం, స్టాంపును విడుదల చేసిన తర్వాత మోదీ మాట్లాడతారు. మధ్యాహ్నం 2 గంటలకు కార్యక్రమం ముగుస్తుంది. మాజీ ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్య నాయుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ, 18 ఎన్డీయే మిత్రపక్షాలు, ఏడు ఎన్డీయేతర (జేడీఎస్, ఎస్ఏడీ, బీఎస్పీ, లోక్‌జనశక్తి, బీజేడీ, టీడీపీ, వైసీపీ) పార్టీల నాయకులు హాజరు కానున్నారు. 60 మంది మతపెద్దలను ఆహ్వానించారు. రాజదండం స్థాపన కోసం తమిళనాడు నుంచి దిల్లీకి వేర్వేరు అధీనమ్‌ల మఠాధిపతులు చేరుకున్నారు. తిరువ్రాదుథురై అధీనమ్ ప్రతినిధులు కూడా వచ్చేశారు. వీరు రాజదండాన్ని మోదీకి అందజేసినట్లు సమాచారం.

రూ.75 నాణెం ఆవిష్కరణ

కొత్త భవన ప్రారంభోత్సవానికి సూచికగా రూ.75 స్మారక నాణెన్ని మోదీ విడుదల చేస్తారు. ఈ మేరకు గెజెట్ నోటిఫికేషన్‌ను ఆర్థిక వ్యవహారాల శాఖ జారీచేసింది. ఈ నాణెం బరువు 34.65 గ్రాములు లేక 35.35 గ్రామాలు ఉంటుందని పేర్కొంది. నాణెం ఒకవైపు అశోకస్థూపం, మూడు సింహాలు, మధ్యలో దేవనాగరి లిపిలో 'భారత్' అని, ఆంగ్లంలో ఇండియా అని ఉంటాయి. దాని కింద రూపాయి గుర్తు, 75 రూపాయలని ఉంటుంది. నాణెం రెండో వైపు పార్లమెంటు భవనం చిత్రం, '2023' (సంవత్సరాన్ని సూచిస్తూ) ముద్రించివుంటాయి.

భారీ భద్రతా ఏర్పాట్లు

దిల్లీలో భారీస్థాయిలో భద్రతా ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ ఆంక్షల జారీ అయ్యాయి. పార్లమెంటు ఉన్న ప్రాంతంలో హైసెక్యూరిటీ ఉన్నాగానీ అదనపు బలగాలను మోహరించి సీసీటీవీ ద్వారా నిఘాను పెంచినట్లు పోలీసులు తెలిపారు. జంతర్ మంతర్ వద్ద రెజ్లర్ల ఆందోళనకు మద్దతుగా మహిళా మహాపంచాయత్ నిర్వహణకు అనుమతి ఇవ్వలేదని పోలీసు అధికారి చెప్పారు. సెంట్రల్ దిల్లీలో పికెట్లు ఏర్పాటు చేశామన్నారు. సరిహద్దుల వద్ద తనిఖీ చేసి వాహనాలను అనుమతిస్తున్నట్లు తెలిపారు.

అవినాశ్ రెడ్డికి ఉపశమనం

(మొదటిపేజీ తరువాయి)

లేదా షర్మిలకు ఇవ్వాలని వివేకా అడిగారు. వివేకాపై రాజకీయంగా పైచేయి సాధించాలని ఆయన భావించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వివేకా ఓటమికి కుట్ర జరిగింది. అవినాశ్ రాజకీయంగా శక్తిమంతుడైతే వివేకాను చంపాల్సిన అవసరం ఏంటని కోర్టుకు తెలిపారు. భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి అరెస్టుకు కారణాలేంటని, వారి నుంచి ఏం తెలుసుకున్నారని ధర్మాసనం ప్రశ్నించింది. సీబీఐ తరపు న్యాయవాది వివరణ ఇస్తూ కుట్రలో ప్రమేయం దృష్ట్యా వారిని అరెస్టు చేశామంటూ కారణాలను వివరించారు. హత్య జరిగిన రోజు తెల్లవారుజామున అవినాశ్ రెడ్డి వాట్సప్‌లో ఎవరితో మాట్లాడారు? ఆయన వాట్సప్‌లో ఉన్న సమయంలో గంగిరెడ్డి వాట్సప్ కూడా బిజీగా ఉందా? భారీ కుట్రలో అవినాశ్ ప్రమేయం ఉన్నట్లు సీబీఐ ఎప్పటినుంచో అనుమానిస్తోంది కదా. మరి ఆయన మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారా? కీలక అంశాలపై ఇంత నత్త నడక దర్యాప్తు ఏమిటని హైకోర్టు ప్రశ్నించింది. సీబీఐ స్పందిస్తూ "వాట్సప్ కాల్ మాట్లాడినట్టు మాత్రమే తెలుస్తోంది. అయితే ఎవరితో మాట్లాడారో ఇంటర్నెట్ ద్వారా గుర్తించలేం. ఎవరితో మాట్లాడారో తెలుసుకునేందుకే అవినాశ్‌ను విచారించాలని అనుకుంటున్నామని, బుధవారం మళ్లీ విచారణకు పిలుస్తున్నామని తెలిపారు. హత్య జరిగిన రోజు అవినాశ్ జమ్మలమడుగు వెళ్లినట్లు చెప్పారు. ఆయన తప్పుడు సమాచారం ఇచ్చారు. జమ్మలమడుగులో ఆరోజు అవినాశ్ ఎన్నికల షెడ్యూల్ లేదు. అనుచరుల ద్వారా ఆయన సాక్షులను ప్రభావితం చేస్తున్నారు. అవినాశ్ రెడ్డి వల్ల సాక్షులు భయపడి ముందుకు రాలేకపోతున్నారని వివరించారు. సీబీఐ వాదనలు ముగిసిన అనంతరం తీర్పు ఈ నెల 31కి వాయిదా వేస్తూ, అప్పటివరకు అవినాశ్‌రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవద్దని న్యాయమూర్తి సీబీఐని ఆదేశించారు.

పరాకాష్ఠకు కేంద్రం ఆగడాలు

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. ఆర్డినెన్స్‌ను ఉపసంహరించుకోవాలని ప్రధానిని డిమాండ్ చేస్తున్నామన్నారు. తామంతా అరవింద్ కేజ్రీవాల్ తరపున నిలబడతామని, ఆయనకు మద్దతిస్తామని ప్రకటించారు. కేంద్రం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా లోక్‌సభ, రాజ్యసభలో తమ గళం వినిపిస్తామని, ఆర్డినెన్స్ ఆమోదం పొందకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రజాదరణగల కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని ఇబ్బందులకు గురిచేయడం ద్వారా దిల్లీ ప్రజలను కేంద్రం అవమానిస్తున్నదన్నారు. అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడుతూ దిల్లీ ప్రజలకు న్యాయం జరిగేందుకు తమ ప్రభుత్వం, పార్టీకి అండగా ఉంటామని కేసీఆర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఇది కేవలం దిల్లీ ప్రజలు సమస్య మాత్రమే కాదని, దేశ ప్రజల సమస్యని కేజ్రీవాల్ తెలిపారు. ముఖ్యమంత్రిగా ఆరోగ్యం, విద్యశాఖల కార్యదర్శులను, డిప్యూటీలను బదిలీ చేసే అధికారం కూడా తనకు లేకపోవడం విచారకరమన్నారు. ఎనిమిదేళ్లుగా దిల్లీలో ప్రభుత్వ అధికారాలన్నీ హైకోర్టు, సుప్రీంకోర్టుకు వెళ్లి కొట్లాడి తెచ్చుకోవాల్సి వచ్చిందన్నారు. ఇటీవలే సుప్రీంకోర్టు తమ ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. అయినా ఎనిమిది రోజుల్లోనే సుప్రీంకోర్టు తీర్పును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చిందని మండిపడ్డారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్త మద్దతు కోరుతున్నామని, మోదీ నియంతృత్వం కొనసాగుతోందన్నారు. ఫెడరల్ వ్యవస్థ పటిష్టత కోసం తాము పోరాడతామని పంజాబ్ సీఎం మాన్ అన్నారు. మనది విభిన్న భాషలు, సంస్కృతులు గల దేశమని, సీఎం కేసీఆర్ చండీగఢ్‌కి వచ్చి అమరులైన రైతు కుటుంబాలకు ఆర్థికసాయం అందించారని గుర్తుచేశారు. ఇటీవలే కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించానని, పంజాబ్‌లో భూగర్భజలాలు ఎలా పెంచాలనే విషయంలో తమకు ఈ పర్యటన ఉపయోగపడిందన్నారు.

వచ్చేది కురుక్షేత్ర యుద్ధం

(మొదటిపేజీ తరువాయి)

ఒప్పందాలు చేసుకున్నాం. ఆ పెట్టుబడులు వచ్చి ఉంటే 30 లక్షల మందికి ఉద్యోగాలు వచ్చేవి. 2019లో ఒక్కసారి అవకాశం ఇవ్వాలని ఎన్నో మాయ మాటలు చెప్పి ప్రజల్ని నిలువునా జగన్ మోసం చేశాడని చంద్రబాబు మండిపడ్డారు. రాష్ట్రంలో సీఐడీ ప్రభుత్వం ఉంది. సీఐడీ అంటే కరప్షన్, ఇన్ ఎఫిషియంట్, డిస్ట్రక్షన్ అని విశ్లేషించారు. రివర్స్ టెండర్లు అన్నాడు. పరిపాలనను రివర్స్ చేశాడు. ప్రజా వేదిక కూల్చివేతతో పాలన మొదలు పెట్టాడు. అమరావతికి మనం రూపం ఇస్తే దాన్ని విధ్వంసం చేశాడు. ప్రపంచంలో రాజధాని లేని రాష్ట్రం లేదు. అమరావతిని నాశనం చేసి రాజధాని లేని రాష్ట్రంగా చేసిన వ్యక్తి జగన్ రెడ్డి. పోలవరం పూర్తయి నదుల అనుసంధానం జరిగితే మంచి ఫలితాలు వచ్చేవి. ఒక్క రోడ్డు వేయలేదు. ఒక్క ప్రాజెక్టు కట్టలేదు. ప్రభుత్వ ఉగ్రవాదంతో ఒక్క పెట్టుబడి రాలేదు. జగన్ చెప్పిన జాబ్ క్యాలెండర్ లేదు... జాబ్స్ లేవు. దిశ చట్టం అన్నాడు. లేని చట్టం పేరుతో రాజమండ్రిలో పోలీస్ స్టేషన్ పెట్టాడు. ఉద్యోగం రావాలి అంటే ప్రత్యేక హోదా కావాలని, 25 మందిని గెలిపిస్తే ప్రత్యేక హోదా సాధిస్తానని... ఇప్పుడు మెడలు దించి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాడు. అమ్మఒడి ఒక నాటకం. నాన్న బుడ్డి వాస్తవం. ఎన్నికల సమయంలో మద్య నిషేధం అని చెప్పిన పెద్ద మనిషి, మద్యం ఆదాయం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చాడని చంద్రబాబు తీవ్రస్థాయిలో సీఎం జగన్ పాలనాతీరుపై ధ్వజమెత్తారు. ఈ రాష్ట్రాన్ని దేశంలో నంబర్ 1గా మార్చే సత్తా తెలుగుదేశం పార్టీకే ఉందని, పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ ఒక సైనికులా పని చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. టీడీపీ ఏపీ అధ్యక్షులు కింజరపు అచ్చెన్నాయుడు, తెలంగాణ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తదితరులు ప్రసంగించారు. ధరలు, పన్నులు, చార్జీల బాదుడే బాదుడు, బీసీ ద్రోహి జగన్ రెడ్డి, సంక్షోభంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల సంక్షేమం తదితర అంశాలపై పార్టీ ముఖ్య నేతలు తీర్మానాలను ప్రవేశపెట్టారు. రాజకీయ తీర్మానాన్ని సీనియర్ నేత యనమల రామకృష్ణుడు, రావుల చంద్రశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టారు.

రాష్ట్రపతిని అవమానించడం తగదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపక్షాలు సూచించినా మోదీ సర్కారు పట్టించుకోలేదని ఆరోపించారు. దీనిని రాజ్యాంగ వ్యతిరేక చర్యగా రామకృష్ణ అభివర్ణించారు. ద్రౌపది ముర్ము గిరిజన మహిళ కాబట్టే పట్టించుకోలేదన్నారు. సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాత్రమే ఈ అన్యాయాన్ని ఘాటుగా విమర్శిస్తున్నారన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు మోదీని బలపరచడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయంగా భయపడుతున్నారో...స్వప్రయోజనాల కోసం ఆరాటపడుతున్నారో వారికే తెలియాలన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ, గవర్నర్ల వ్యవస్థను మోదీ సర్కారు ఇష్టానుసారం వాడుకుంటున్నదని రామకృష్ణ ఆరోపించారు. స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థలను స్వప్రయోజనాలకు వాడుకోవడం రాజ్యాంగానికి విరుద్ధమన్నారు. సీబీఐని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. ఇందుకు వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసే నిదర్శనమన్నారు. కేంద్రమంత్రి అమిత్‌షా, జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో సీబీఐను జేబు సంస్థగా వాడుకుంటున్నారన్నారు. మద్యం కుంభకోణం పేరుతో దిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను 9 గంటలు విచారించిన సీబీఐ... ఉపముఖ్యమంత్రి సిసోదియాను ఏకంగా జైలుకే పంపిందని, కానీ కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి విషయంలో ఎందుకు తాత్సారం చేస్తున్నదో అర్థం కావడం లేదన్నారు. మద్యం కుంభకోణంలో వంద కోట్ల అవినీతి జరిగిందని సీబీఐ నానాహంగామా చేస్తోందని, ఏపీలో నెలకు వందకోట్ల ఇసుక దందా, మట్టి దందా జరుగుతోందని, ఈ విషయాలు సీబీఐకి పట్టవా అని ఆయన నిలదీశారు. కర్నూలులో సీబీఐ వ్యవహారశైలి విస్మయం కలిగిస్తోందన్నారు. కర్నూలుకు వచ్చిన సీబీఐ అధికారులు అతిథిగృహంలో కూర్చుని జుట్టుపీక్కోవడమేమిటని ప్రశ్నించారు. జర్నలిస్టులపై దాడుల గురించి ఎస్పీ, ఏఎస్పీలకు వినతిపత్రం ద్వారా తెలిపినా చర్యలు శూన్యమన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి కేసుతో సీఎం జగన్‌కు సంబంధం ఉన్నట్లు సీబీఐ కోర్టుకు చెప్పిందని, దీనిపై సీఎం జగన్ స్పందించాలని, ప్రజలకు వివరణ ఇవ్వాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇలాంటి విషయాల్లో తగుదునమ్మా అంటూ ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి జోక్యం చేసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ప్రతిపక్ష పార్టీలను అణచివేస్తున్న సీఎం జగన్‌కు తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని రామకృష్ణ అన్నారు. ఈ విషయాలపై చర్చావేదికలు నిర్వహిస్తామని, మేధావులు, నిపుణులను భాగస్వాములను చేస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దమననీతిని ఎండగడతామని ఆయన హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, నగర కార్యదర్శి ఎన్.వెంకటశివ, జిల్లా కార్యవర్గ సభ్యుడు గంగా సురేశ్ పాల్గొన్నారు.

'నీతిఆయోగ్'కు 10మంది సీఎంలు గైర్హాజరు

(మొదటిపేజీ తరువాయి)

సహకార సమాఖ్య వ్యవస్థ ఒక పరిహాసంగా మారిందని విమర్శించారు. తాను రాలేనని, తనకు బదులు బెంగాల్ ఆర్థిక మంత్రి, ప్రధాన కార్యదర్శిని పంపుతానని ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ వెల్లడించారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉన్నందున రాలేమని బీహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్, తెలంగాణ సీఎం కె.చంద్రశేఖరరావు, ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ వేర్వేరుగా తెలియజేశారు. నిధుల కేటాయింపులో పంజాబ్‌పై కేంద్ర వివక్ష కారణంగా ఈ సమావేశానికి దూరంగా ఉన్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పేర్కొన్నారు. అనారోగ్యం వల్ల రాలేనని రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ వెల్లడించారు. కర్నాటకలో కేబినెట్ విస్తరణ క్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గైర్హాజరయ్యారు. సింగపూర్, జపాన్ పర్యటనలో ఉన్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ హాజరుకాలేదు. సమావేశానికి రాలేనని ప్రకటించిన కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అందుకుగల కారణాలను తెలుపలేదు. కాగా, బీజేపీయేతర పార్టీల ముఖ్యమంత్రులు ఈ సమావేశానికి దూరంగా ఉండటానికి కారణం కేంద్రప్రభుత్వం వారిని పట్టించుకోకపోవడమే అని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ అన్నారు. 'కేంద్రం మాట వినని వారి డిమాండ్లను నీతి ఆయోగ్ పట్టించుకోవడం లేదు' అని వ్యాఖ్యానించారు.

ఇదిలావుంటే, 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్నదే లక్ష్యమని, ఇందుకోసం ఉమ్మడి విజన్ అవసరమని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. రాష్ట్రాల అభివృద్ధితోనే భారతదేశ అభివృద్ధి సాధ్యమని చెప్పారు. పౌరుల కలలను సాకారం చేసే కార్యక్రమాలను సమర్థంగా అందించే స్థాయికి రాష్ట్రాలు ఎదగాలని, స్వయంసమృద్ధిని సాధించాలని, ఆర్థికంగా బలపడాలని సూచించారు. ఆర్థికంగా బలపడేందుకు అవసరమైన చర్యలు, నిర్ణయాలు తీసుకోవాలని రాష్ట్రాలకు సూచించారు. సమావేశంలో ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత, మౌలిక సదుపాయల వృద్ధి తదితర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, పీయూష్ గోయల్, స్మృతి ఇరానీ, ధర్మేంద్ర ప్రధాన్, నారాయణ్ రాణెతో పాటు ఉత్తరప్రదేశ్, అసోం, జార్ఖండ్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల లెఫ్టినెంట్ గవర్నర్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధిని బహిష్కరించినట్టే: ప్రభుత్వ వర్గాలు

పది రాష్ట్రాల ముఖ్యమంత్రులు నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరించడంపై కేంద్రప్రభుత్వం ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ సమావేశాన్ని బహిష్కరించడం అంటే అర్థం రాష్ట్ర అభివృద్ధిని బహిష్కరించినట్టే అని కేంద్రప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జీసీఎం సమావేశంలో వందకుపైగా అంశాలపై చర్చ జరుగుతుందని, దీనిని బహిష్కరించడం వల్ల ఆయా రాష్ట్రాలు ప్రాతినిధ్యాన్ని కోల్పోయాయన్నాయి. 2047 నాటికి వికాశ భారత్, ఎంఎస్‌ఎంఈలు, మౌలిక వసతులు, పెట్టుబడుల వృద్ధి, మహిళా సాధికారత, ఆరోగ్యం, పౌష్టికాహారం, నైపుణ్యాభివృద్ధి, గతిశక్తి వంటి వాటిపై కార్యాచరణ ప్రణాళికలు ఈ సమావేశంలో రూపొందుతాయని వెల్లడించాయి. ఆయా అంశాలపై జరిగిన చర్చలు, నిర్ణయాల ఫలాలు సమావేశాన్ని బహిష్కరించిన ముఖ్యమంత్రులకు అందబోవని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

ఇంతటి నిర్లక్ష్యం తగదు: బీజేపీ

నీతి ఆయోగ్ సమావేశానికి పది రాష్ట్రాల ముఖ్యమంత్రులు గైర్హాజరు కావడాన్ని బీజేపీ తీవ్రంగా పరిగణించింది. ఇది ప్రజా వ్యతిరేక వైఖరని, ఇంతటి నిర్లక్ష్యం తగదని వ్యాఖ్యానించింది. 'నీతి అయోగ్ దేశాభివృద్ధికి కీలకం. ఈ సమావేశంలో వందాంశాలపై చర్చ జరుగుతుంది. సమావేశానికి రాని ముఖ్యమంత్రులు తమ రాష్ట్ర ప్రజల బాణీని వినిపించలేకపోయారు' అని బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రవిశంకర్ ప్రసాద్ ఘాటుగా విమర్శించారు. మోదీకి వ్యతిరేకంగా సాగించే పోరాటంలో ఇంకెంత వరకు వెళతారు? అని ఆయన ప్రశ్నించారు.

పెండింగ్ నిధులు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్తు కోసం ఈ కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. శనివారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ 8వ పాలకమండలి సమావేశంలో సీఎం జగన్ పాల్గొన్నారు. సమావేశానుద్దేశించి ప్రసంగించిన సీఎం ఆరోగ్యకరమైన పెట్టుబడుల ద్వారా మౌలిక సదుపాయాలను బలోపేతంచేయాలని తద్వారా ఆర్థికవ్యవస్థ శ్రీఘ్రగతిన పురోగమిస్తుందన్నారు. అలాగే నీతి ఆయోగ్ చర్చించే వివిధ అంశాల్లో రాష్ట్రం సాధించిన ప్రగతిని వివరించేలా నోట్‌ను సమావేశానికి సమర్పించారు. నీతిఆయోగ్ సమావేశం ముగిసిన అనంతరం కేంద్ర జలశక్తి మంత్రితో భేటీ అయ్యారు. కేంద్రం హోం మంత్రి అమిత్‌షాతో కూడా విడిగా భేటీ అయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

పార్లమెంటు భవన ప్రారంభోత్సవాన్ని ఆపండి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: ప్రజాస్వామ్యాన్ని గౌరవించి విపక్షాలు వ్యతిరేకిస్తున్న నూతన పార్లమెంటు భవనాన్ని ప్రధాని మోదీ ప్రారంభించాలన్న యోచనను ఉపసంహరించుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త పార్లమెంటు భవనం ప్రారంభించటం సంతోషమే గానీ...దానిపై కొన్ని రోజులుగా వివాదాలు తలెత్తడం విచారకరమని నారాయణ పేర్కొన్నారు. ప్రజాస్వామానికి, రాజ్యాంగానికి అర్థంగా నిలిచే పార్లమెంటు భవాన్ని రాష్ట్రపతితో ప్రారంభింపచేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా నిర్మించిన భవనం మోదీ సొంత డబ్బులతో కాదని, అది ప్రజల సొత్తు అని నారాయణ వ్యాఖ్యానించారు. పార్లమెంటు భవనం ప్రారంభోత్సవ విషయంలో రాజ్యాంగ విలువల్ని ఎందుకు ఉల్లంఘిస్తున్నారని ప్రశ్నించారు. 79వ అధికరణ ప్రకారం కొత్త పార్లమెంటును రాష్ట్రపతి ప్రారంభించాల్సి ఉందని పేర్కొన్నారు. బీజేపీ యజ్ఞాలు, యాగాలు, సెంటిమెంట్లు, జాతకాల గురించి ఆలోచిస్తున్నదని విమర్శించారు. ద్రౌపది ముర్మును ఆదర్శవంతమైన మహిళ అని చెప్పి దేశానికి రాష్ట్రపతిని చేశారని గుర్తు చేశారు. రాష్ట్రపతితో ప్రారంభోత్సవానికి ఎందుకు వెనుకాడుతున్నారని సందేహం వెలిబులిచ్చారు. శుభకార్యాలను ముత్తైదువుతో క్రతువు చేయించాలనే ఉద్దేశంతో...ముర్ము విధవరాలు కాబట్టి పక్కన పెట్టారా అని నిలదీశారు. ఇదే నిజమైతే మహిళల్ని బీజేపీ బహిరంగంగా అవమానించడమవుతుందని పేర్కొన్నారు. కర్నాటక ఎన్నికల్లో ఓటమి తరువాత దక్షిణాదిలో బీజేపీకి గేట్లు మూతపడ్డాయని చెప్పారు. ఎలాగైనా తమిళనాడులో కాలుపెట్టాలనే ఉద్దేశంతో రాజదండాన్ని ముందుకు తీసుకువస్తున్నారని ఆరోపించారు.

స్వాతంత్ర్యోద్యమం, సాయుధపోరాటాలు, మహాత్మాగాంధీ ఉద్యమాలు లేకుండా సెంగోల్ ద్వారా అధికార మార్పిడి జరిగిందా అని ప్రశ్నించారు. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని బీజేపీకి చరిత్ర తెలియదన్నారు. రాజదండాన్ని మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ మ్యూజియంలో పెట్టారని గుర్తు చేశారు. కొత్త పార్లమెంటు భవనం ప్రారంభోత్సవాన్ని ప్రస్తుతానికి ఉపసంహరించుకోవాలని, అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి తరువాత నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

50 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలి

లెనిన్‌బాబు డిమాండ్

విశాలాంధ్ర-డోన్: మెగా డీఎస్సీ ద్వారా 50 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, గ్రూప్ 1, గ్రూప్ 2 పోస్టులు పెంచాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక నక్కి రామన్న భవన్‌లో లెనిన్‌బాబు శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా రెండు లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సచివాలయాలలోనే 21 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, వాటిని కూడా తక్షణమే భర్తీ చేయాలని లెనిన్‌బాబు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగితపై రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించాలని, వారందరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. నిరుద్యోగ భృతిని నెలకు పదివేల రూపాయలు ఇవ్వాలని, నంద్యాల జిల్లాలో నూతన పరిశ్రమలు నెలకొల్పి స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగ రాముడు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు రణత్, నాయకులు దివాకర్, రాఘవేంద్ర, రంగస్వామి పాల్గొన్నారు.

సవర భాషా ఉపాధ్యాయులను పునరుద్ధరించాలి

సీఎం జగన్‌కు సీపీఐ నేత ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సవర భాషా ఉపాధ్యాయులను రెన్యువల్ చేసి, గిరిజన (సవర) విద్యార్థినీవిద్యార్థులకు విద్యను అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య శనివారం లేఖ రాశారు. స్థానిక సవర భాష బోధన లేక భారీగా గిరిజన విద్యార్థులు డ్రాపౌట్స్ అవ్వడం ఆందోళన చెందాల్సిన విషయం. ఇలాంటి నష్టం జరగముందే ప్రభుత్వం తేరుకొని విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే సవర భాషా విద్యా (వలంటీర్ల) ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలి. స్థానిక గిరిజనులకు సవర భాషే మాతృ భాషగా పరిగణించడం జరుగుతుంది. పార్వతీపురం మన్యం జిల్లానే తీసుకుంటే అక్కడ ఐటీడీఏ పరిధిలో 176 మంది సవర మాతృ భాషా ఉపాధ్యాయులు విద్యా బోధకులుగా ఉన్నారు. గత సంవత్సరం ప్రభుత్వం రెన్యువల్ చేయడం వలన విద్యార్థుల సంఖ్య బాగా పెరిగిందని, మంచి ఉత్తీర్ణత స్థాయిలో నిలిచారని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ఎటువంటి రెన్యువల్ నోటీసులు జారీ చేయకపోవడంతో గిరిజన విద్యార్థుల డ్రాపౌట్స్ సంఖ్య భారీగా పెరిగి, దాని వలన భవిష్యత్తులో గిరిజన విద్య కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. ప్రాథమిక విద్యా స్థాయి వరకు మాతృ భాషలోనే విద్యార్థులకు విద్యాబోధనలు చెప్పాలనే నిబంధన విద్యారంగంలో ఉన్నప్పటికీ, దానిని ప్రభుత్వం, ఐటీడీఏ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో సర్వశిక్షా అభియాన్ ఎస్పీడీని కలవడంతో ఉపాధ్యాయులను ప్రతి ఏటా క్రమబద్ధీకరణగా నియమించేటట్లు ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. నేడు అదే విషయాన్ని విస్మరిస్తున్నారు. ఇప్పటికే అనేక కారణాలతో పాఠశాలలను మూసివేస్తున్నారు. గిరిజన విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, నిరక్షరాస్యతా శాతం గిరిజన ప్రాంతంలోనే అధికంగా పెరుగుతుందని నిపుణులు వెల్లడిస్తున్నారు. అందువల్ల వెంటనే మన్యం జిల్లా వ్యాప్తంగా ఉన్న 176 సవర మాతృ భాషా ఉపాధ్యాయులందరిని రెన్యువల్ చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఐటీడీఏ పరిధిలో ఉన్న సవర భాషా ఉపాధ్యాయులందరినీ రెన్యువల్ చేయాలని, లేకుంటే భవిష్యత్తులో సీపీఐ అధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపట్టాల్సి వస్తుందని ఈశ్వరయ్య లేఖలో పేర్కొన్నారు.

ప్రపంచ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులు పోటీపడాలంటే

రవాణా వ్యయం తగ్గాలి

- సమ్మిళిత వృద్ధికి మహిళా సాధికారతే కీలకం
- నీతి ఆయోగ్ సమావేశంలో సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రపంచ మార్కెట్‌లో భారతీయ ఉత్పత్తులు పోటీపడాలంటే రవాణా వ్యయం గణనీయంగా తగ్గాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో శనివారం ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ ఎనిమిదవ పాలకమండలి సమావేశానికి హాజరైన సీఎం, నీతి ఆయోగ్ చర్చించే అంశాల్లో ఏపీ సాధించిన ప్రగతిని వివరించేలా ఒక నోట్‌ను సమర్పించారు. ఆరోగ్యకరమైన పెట్టుబడుల ద్వారా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాలని, తద్వారా ఆర్థికవ్యవస్థ శ్రీఘ్రగతిన పురోగమిస్తుందన్నారు. దేశంలో రవాణా వ్యయం జీడీపీలో 14శాతంగా ఉందనీ, ఇది చాలా ఎక్కువ అని అన్నారు భారతీయ ఉత్పత్తులు ప్రపంచస్థాయిలో పోటీపడేందుకు ఇది ప్రతిబంధకంగా మారిందన్నారు. అమెరికాలో చూసుకుంటే రవాణా ఖర్చు కేవలం 7.5శాతానికే పరిమితమైంది. గడచిన తొమ్మిదేళ్లలో సరకు రవాణా కారిడార్లు, జాతీయ రహదారులపై ప్రభుత్వం ప్రశంసనీయరీతిలో వ్యయం చేస్తోందన్నారు. మనం ఆశించిన ఫలితాలను సాధించేందుకు దీన్ని కొనసాగించడం చాలా అవసరమన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోర్టు ఆధారిత అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటవుతున్నాయనీ, రాష్ట్ర ప్రభుత్వం కర్నూలులోని ఓర్వకల్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసిందని చెప్పారు. విశాఖలో అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా పీపీపీ మోడ్‌లో నిర్మిస్తోందని తెలిపారు. దేశ జీడీపీలో తయారీ, సేవల రంగం వాటా 85శాతం దాటినప్పుడే 'వికసిత్ భారత్' లక్ష్యం నెరవేరుతుందన్నారు. రెండు రంగాల ప్రపంచ సగటు వాటా 91.5శాతం. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు వ్యవసాయం, పెట్టుబడులు రెండింటికి సంబంధించిన అంశాలపై అత్యంత దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ఆహారరంగంలో స్వయం సమృద్ధిని సాధించడంతోపాటు, వ్యవసాయ ఉత్పాదకతను పెంపొందించేందుకు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం చాలా అవసరమని సీఎం చెప్పారు. విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ 2023కి అద్భుతమైన స్పందన లభించిందన్నారు. రూ. 13 లక్షల కోట్ల భారీ పెట్టుబడులకు వివిధ సంస్థలు, కంపెనీలు ముందుకు వచ్చాయన్నారు దీనివల్ల దాదాపు 6 లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. ప్రజారోగ్యం, పౌష్టికాహారం కూడా చాలా ముఖ్యమని, అందుకే హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్, పౌష్టికాహారంపై అత్యంత శ్రద్ధపెట్టాలన్నారు. ఇందుకోసం ఏపీలో 10,592 గ్రామ, వార్డు క్లినిక్‌లను ఏర్పాటు చేసింది, ప్రతి విలేజ్ మరియు వార్డు క్లినిక్‌లో 105 రకాల అవసరమైన మందులు మరియు 14 రకాల డయాగ్నస్టిక్స్ అందుబాటులో ఉన్నాయి.గత రెండున్నర సంవత్సరాల కాలంలో, రాష్ట్రంలో 48,639 మంది వైద్యులు మరియు ఆరోగ్య సిబ్బందిని నియమించామని, విలేజ్ క్లినిక్‌ల నుండి బోధనాసుపత్రుల వరకు అవసరమైన సంఖ్యలో వైద్యులు, నర్సులు పారామెడిక్స్ ఉండేలా చూసుకున్నామని తెలిపారు. విలేజ్ క్లినిక్ కాన్సెప్ట్‌ను పూర్తి సామర్థ్యంతో అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్‌ను కూడా ప్రారంభించిందన్నారు. నైపుణ్యాభివృద్ధి అన్నది మరొక కీలక అంశమనీ, జర్మనీ వంటి అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఈ అంశంలో క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయన్నారు. తగ్గుతున్న జననాల రేటు కారణంగా, ఆ దేశాలు చివరికి శ్రామికశక్తి కొరతను ఎదుర్కొంటాయనీ, పని చేసే వయస్సున్న జనాభా విషయంలో తీవ్రకొరతను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అదృష్టవశాత్తూ, దేశ జనాభాలో అధిక భాగం పనిచేసే వయస్సున్న వారే ఉన్నారు. ఇది దేశానికి అత్యంత ప్రయోజనకరమన్నారు. ఇక సమ్మిళిత వృద్ధి లక్ష్యాన్ని సాధించడానికి మహిళా సాధికారత చాలా కీలకమని, మహిళలకు ఆర్థిక వనరులు మరియు అవకాశాలను పెంపొందించడానికి, ఏపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని వివరించారు. పెట్టుబడి పెట్టడానికి, తీవ్రమైన పోటీని తట్టుకునేలా ఆయా కార్యక్రమాల్లో కొనసాగడానికి మహిళలకు పరిమిత సామర్థ్యం ఉందని ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ అనుసంధానాలను పొందడంలో మహిళలను చేయూతనిచ్చి నడిపించే ప్రగతిశీల విధానాన్ని ప్రభుత్వాలు అవలంబించాలని, చివరగా అన్ని రాష్ట్రాలూ కూడా ఒక జట్టుగా పనిచేయాలని, ప్రతి రాష్ట్రం శ్రేయస్సు మొత్తం దేశంతో ముడిపడి ఉంటుందని సీఎం అన్నారు.

కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి వద్ద

జర్నలిస్టులపై దాడి నిందితులను అరెస్ట్ చేయాలి

సీఎం జగన్‌కు సీపీఐ నేత రామకృష్ణ లేఖ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి వద్ద జర్నలిస్టులపై దాడికి పాల్పడిన వారిని అరెస్టుచేసి, కఠిన చర్యలు తీసుకో వాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ శనివారం లేఖ రాశారు. కడప ఎంపీ అవినాశ్ రెడ్డిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేయవచ్చుననే సమాచారం మేరకు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు, వీడియో, ఫొటోగ్రాఫర్లు కర్నూలులోని విశ్వభారతి ఆసుపత్రి వద్దకు వెళ్లగా అప్పటికే అక్కడికి చేరుకున్న అవినాశ్‌రెడ్డి అనుచరులు జర్నలిస్టులపై బెదిరింపులకు దిగడమే కాక, దొరికిన వారిని దొరికినట్లు ఎత్తుకెళ్లి పక్కనే ఉన్న హోటల్‌లో పడవేసి, షట్టర్లు మూసి దారుణంగా కొట్టారని ఆ లేఖలో తెలిపారు. దాడికి పాల్పడిన వ్యక్తులు కడప జిల్లాకు చెందిన వారిగా తెలుస్తోందన్నారు. అంతేగాక విశ్వభారతి ఆసుపత్రి దగ్గర వార్తల కవరేజ్‌కు వెళితే పదేపదే దాడి చేసేందుకు ప్రయత్నించడం, అదేదో నిషేధిత ప్రాంతంలా అవినాశ్‌రెడ్డి అనుచరులు వ్యవహరించడం దుర్మార్గగా పేర్కొన్నారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించి, అరెస్టు చేయాలని కోరుతూ ఏపీయూడబ్ల్యూజే నేతలు గత మంగళవారం జిల్లా అడిషనల్ ఎస్పీని కలిసి విజ్ఞప్తి చేసినప్పటికీ, ఇప్పటివరకు చర్యలు చేపట్టకపోవడం విచారకరమన్నారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే ఇటువంటి చర్యలను రామకృష్ణ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న మీడియా ప్రతినిధులపై భౌతిక దాడులు తగదన్నారు. దాడి జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాలలోని సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించి సుమోటోగా కేసు నమోదు చేయాలన్నారు. దుండగులను తక్షణమే అరెస్టుచేసి, కఠిన చర్యలు చేపట్టాలనీ, ఇటువంటి దాడులు పునరావృతం కాకుండా తగు చర్యలు చేపట్టాలని ఆ లేఖలో రామకృష్ణ కోరారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు

విశాలాంధ్ర- ఏలూరు: ఉద్యమాల ద్వారానే పాలకులు దిగివచ్చి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తారని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు.స్థానిక టు బాకో మర్చంట్స్ కల్యాణ మండపంలో ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో శనివారం మూడవ ప్రాంతీయ సదస్సు జరిగింది.ఏపీ జేఏసీ అమరావతి ఏలూరు జిల్లా చైర్మన్ కె రమేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత 80 రోజులుగా చేసిన ఉద్యమాల వల్లనే ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తోందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారమే తమ సంఘం ధ్యేయమన్నారు.గత రెండున్నర నెలలుగా చేసిన ఉద్యమాల వలననే జీపీఎఫ్, ఏపీ జీఎల్ఐ, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్, జిల్లాలకు 16శాతం హెచ్ఆర్ఏ, ఆర్టీసీ ఉద్యోగులకు ఓటీ జీవోలను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వం భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ నిజాయితీగా ఉద్యమాలు చేసేవారిపై బురదజల్లే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. డిమాండ్లు సాధించేంతవరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఏపీ జేఏసీ అమరావతి స్టేట్ అసోసియేట్ చైర్మన్ పేర్రాజు, కోశాధికారి వీవీ మురళీకృష్ణ నాయుడు మాట్లాడుతూ ఉద్యోగుల నాలుగు ప్రధాన డిమాండ్లైన పీఆర్సీ అరియర్లు, డీఏ అరియర్లు, కొత్త పేస్కేళ్ళు, స్పెషల్ పే, 12వ పీఆర్సీ నియామకం జరపాలన్నారు. సదస్సులో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు బండి .వెంకటేశ్వరరావు, కె కృష్ణమాచార్యులు, సీఐటీయూ నాయకులు బి సోమయ్య, ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ సంఘాల నాయకులు చేబ్రోలు కృష్ణమూర్తి, ఎస్ కృష్ణమోహన్, ఎన్ శ్రీనివాసరావు, వీరయ్య, ఎస్ శివకుమార్ రెడ్డి, దేవి, కే.సుమన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత స్థానిక పాత బస్టాండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహం నుంచి సభా వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు

జంగాల అజయ్

విశాలాంధ్ర-మంగళగిరి: ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు సాగించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ పిలుపునిచ్చారు. గుంటూరు నగర పరిధిలోని సీపీఐ కార్యాలయంలో (వేములపల్లి శ్రీకృష్ణ భవన్లో) శనివారం పార్టీ నియోజకవర్గ కమిటీ సమావేశం జరిగింది. నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో జంగాల అజయ్ మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యలను గాలికి వదిలి ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. బటన్ నొక్కుతూ ప్రజలకు ఎంతో సేవ చేస్తున్నట్లు నమ్మించే ప్రయత్నాలు సాగిస్తున్నారని అన్నారు. నిడమర్రులో లే అవుట్ దగ్గర పనిచేస్తున్న కార్మికులు, సచివాలయ సిబ్బంది 30మంది గాయపడినా ప్రభుత్వం నోరెత్తలేదని విమర్శించారు. బందోబస్తు విధుల్లో కానిస్టేబుల్ పాముకాటుకు గురై చనిపోతే స్పందించలేదన్నారు. రాజధానిని విచ్చిన్నం చేయటానికి రాష్ట్రప్రభుత్వం పూనుకుందని, నిరుద్యోగాన్ని పారద్రోలతానని హామీలు చేసి ఆచరణలో వాలంటీర్ల ఉద్యోగాలిచ్చి, వారిని కట్టుబానిసలుగా మార్చారని దుయ్యబట్టారు. రైతురాజ్యం నిర్మిస్తానన్న జగన్ విత్తనాలు, పురుగుల మందు, ఎరువుల కల్తీపై నోరు మెదపడం లేదని, అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోకపోగా వ్యవసాయ రంగాన్ని అగాధంలోకి నెట్టి వేస్తున్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్ సమస్య పరిష్కారం చేస్తానని చెప్పి ఉద్యోగ, కార్మికుల, ఉపాధ్యాయులకు అన్యాయం చేశారన్నారు. కాగా, జూన్ 6, 7వ తేదీలలో జిల్లాస్థాయి శిక్షణ తరగతులు గుంటూరులోని మల్లయ్య లింగయ్య భవన్‌లో జరుగుతాయని తెలిపారు. జూన్ 27, 28, 29, 30వ తేదీలలో గుంటూరులో జరిగే యువజన సమ్మేళనం జయప్రదం చేయాలని పార్టీ, ప్రజా సంఘాల కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు జాలాది జాన్ బాబు, కంచర్ల కాశయ్య, అన్నవరపు ప్రభాకర్, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నందం బ్రహ్మేశ్వర రావు, ముసునూరు సుహాస్, బొర్రా మల్లికార్జునరావు, చిన్ని సత్యనారాయణ, బత్తూరి మోహన్రావు పాల్గొన్నారు.

ముగ్గురు కార్మికుల దుర్మరణం

- బాపట్ల జిల్లాలో నాపరాయి లారీ బోల్తా
- మృతులు పల్నాడు జిల్లావాసులు

విశాలాంధ్ర-రేపల్లె: బాపట్ల జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. నాపరాయి లారీ బోల్తాపడి ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. రోజు మాదిరిగా నాపరాయి లోడింగ్, అన్‌లోడింగ్ పనులకు వెళ్లిన కార్మికులు మృత్యువాత పడ్డారు. బాధిత కుటుంబాల్లో విషాదం నిండింది. వివరాల్లోకి వెళితే బాపట్ల జిల్లా రేపల్లె మండలం రావి అనంతవరం గ్రామ సమీపంలో శనివారం ఉదయం 5:30 గంటల సమయంలో నాపరాయి లోడుతో ఉన్న లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన గల కాల్వలోకి దూసుకుపోయింది. లారీపైన గల ముగ్గురు కార్మికులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. లారీ క్యాబిన్‌లో ఉన్న మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణ సీఐ విజయచంద్ర తెలిపిన సమాచారం ప్రకారం పల్నాడు జిల్లా మాచర్ల నుండి బాపట్ల జిల్లా రేపల్లెకు నాపరాయి లోడ్‌తో వస్తున్న ఏపీ 27 టీఏ 2478 నెంబరు గల లారీ రేపల్లె మండల పరిధిలోని రావి అనంతవరం సమీపంలో అదుపుతప్పింది. రోడ్డు పక్కన గల కాల్వలో పడింది. ప్రమాదం జరిగిన సమయంలో లారీ క్యాబిన్‌లో ముగ్గురు కార్మికులు ఉండగా, లారీపైన మరో ముగ్గురు కార్మికులు ఉన్నారు. డ్రైవర్ నిద్రమత్తు కారణంగా లారీ కాల్వలోకి దూసుకెళ్లింది. ప్రమాదంలో రెంటచింతల మండలం పాశర్లపాడు గ్రామానికి చెందిన చినపల్లి చెన్నకేశవులు, సాంబయ్య, వలి మృతిచెందారు. పాశర్లపాడుకు చెందిన గుడిపల్లి చిన్న సుబ్బయ్య, చల్ల చిన కాసాల, రెంటచింతల మండలం మిత్తగుడిపాడుకు చెందిన సైదారావు తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రేపల్లే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, లారీ ప్రమాదం వార్త తెలిసిన వెంటనే సీఐ విజయచంద్ర ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ప్రైవేట్ అంబులెన్స్‌ల ద్వారా క్షతగాత్రులను గుంటూరు వైద్యశాలకు తరలించారు. పంట కాల్వలోకి దిగి మృతదేహాల కోసం వెతుకులాట ప్రారంభించారు. ఒక్కొక్క నాపరాయిని తొలగించుకుంటూ మూడు మృతదేహాలను వెలికి తీశారు. నాపరాళ్ల కింద ఉన్న మృతదేహాలను బయటికి తీయడానికి స్థానికులెవరూ ముందుకు రాలేదు. దీంతో సీఐ, మరో ముగ్గురు పోలీసులు కొన్ని గంటల పాటు శ్రమించి మృతదేహాలను బయటికి తీసి మార్చురీకి తరలించారు. సీఐ చొరవను ప్రజలు అభినందించారు.

మోదీ తీరు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

విశాలాంధ్ర-తణుకు: దేశ ప్రజల సార్వభౌమాధికారానికి ప్రతీక అయిన పార్లమెంటు కొత్త భవనాన్ని దేశ ప్రథమ పౌరురాలు, పార్లమెంటు ఉభయ సభలకు అధిపతి అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో ప్రారంభోత్సవం చేయించడానికి బదులు ఆమెకు ఆహ్వానం కూడా లేకుండా లోక్‌సభలో కేవలం అధికార పక్షం నాయకుడిగా, ప్రధానిగా ఉన్న మోదీనే ప్రారంభించనుండటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని అనేక మంది వక్తలు విమర్శించారు. స్థానిక సురాజ్య భవనంలో తణుకు స్టడీ సర్కిల్ రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించింది. దారి దీపం మాసపత్రిక సంపాదకులు డి.వి.వి.ఎస్.వర్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ నిరంకుశ చక్రవర్తుల అధికార చిహ్నమైన 'రాజదండాన్ని' పార్లమెంటులో ప్రదర్శనకు పెట్టడం ప్రజాస్వామ్యం ముసుగులో రాజరికాన్ని, ఏక వ్యక్తి పాలనను కీర్తించడం కోసమేనని, అధ్యక్ష తరహా పాలనకు దారులు వెయ్యడమేనని అన్నారు. పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవానికి 'హిందూత్వ పితామహుడు సావర్కార్' జయంతి రోజును ముహూర్తంగా ప్రధాని ఎంచుకోవడాన్ని వారు తప్పు పట్టారు. సావర్కార్ బ్రిటిష్ ప్రభుత్వానికి అనుకూలంగా తన సేవలందిస్తానని ఆరు సార్లు క్షమాభిక్ష ఉత్తరాలు రాసి జైలు నుంచి విడుదలయిన వ్యక్తి అని, జాతీయోద్యమానికి వ్యతిరేకంగా బ్రిటిష్ ప్రభుత్వం పంచన చేరి ఆ ప్రభుత్వం నుంచి నెలకు 60 పెన్షన్ తీసుకుని పని చేయడమే కాకుండా జాతిపిత గాంధీజీ హత్య కేసులో కుట్ర దారునిగా గాడ్సేతో పాటు జైలుకు వెళ్లిన వ్యక్తి అని విమర్శించారు. ఇది జాతీయోద్యమానికి, జాతిపితకు తీరని ద్రోహమవుతుందని అభిప్రాయపడ్డారు. బ్రిటిష్ పాలకుల 'విభజించి -పాలించు' రాజనీతికి బీజాలు వేసింది సావర్కారే అని తెలిపారు. ఈ దేశం హిందువులకు మాత్రమే పుణ్యభూమి... ముస్లింలు, క్రైస్తవులకు కాదని, వారు ఎప్పటికీ ఈ దేశ పౌరులు కాలేరని ప్రకటించినందుకే సంఘ్ పరివార్ ఆయనను తలకెత్తుకుందని విమర్శించారు. అందువల్ల రాజ్యాంగంలోని ప్రాధాన్యతా క్రమం ప్రకారం పార్లమెంటు కొత్త భవనాన్ని రాష్ట్రపతితో ప్రారంభింపచేయడం, రాజ్యాంగ దినం అయిన నవంబరు 26వ తేదీ దానికి సముచితంగా ఉంటుందని వక్తలు తెలిపారు. సమావేశంలో సామాజిక హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు పి.మురళీకుమార్, సమతా ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు నీలం మాల్యాద్రి, న్యాయవాదులు గొల్లపల్లి అంబేద్కర్, కౌరు వెంకటేశ్వర్లు, డా. ముప్పన రఘు, డా. రమేష్ చంద్రబాబు, విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ, సీపీఐ నాయకులు నాగరాజు, కాంగ్రెస్ నాయకులు దిరిసిపో రామకృష్ణ ప్రసంగించారు.

వేరుశనగ రైతు కంట కన్నీరు

ఆదుకోని ప్రభుత్వం: జగదీశ్ విమర్శ

విశాలాంధ్ర-గుంతకల్లు: అనంతపురం జిల్లాలో 25 లక్షల ఎకరాలలో వేరుశనగ పంట పండించే రైతన్నకు కంట కన్నీళ్లే మిగిలింది. ప్రస్తుతం ఆరు లక్షల ఎకరాలలో మాత్రమే పంటలు పండిస్తున్నారనీ, ప్రభుత్వం వేరుశనగ పంట రైతన్నకు బీమా, 90 శాతం రాయితీ ఇవ్వకుండా ఆదుకోలేని దుస్థితి నెలకొందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీశ్ అన్నారు. శనివారం కసాపురంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ప్రభుత్వం రైతులకు అంది స్తున్న వేరుశనగలను పరిశీలించి నిరసన తెలిపారు. ఈ నిరసనలో సీపీఐ నియోజవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, మండల కార్యదర్శి రాము రాయల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ... వేరుశనగంటే అనంతపురం, అనంతపురం అంటే వేరుశనగ పంట గుర్తుకొచ్చేదన్నారు. గతంలో ప్రభుత్వ శాస్త్రవేత్తలు మొలక శాతాన్ని పరీక్షించి దానికి వచ్చే ఫలితం ఆధారంగా విత్తన కాయలను కొనుగోలు చేయాలా వద్దా అని నిర్ధారణ చేసేవారనీ, ప్రస్తుతం ప్రైవేట్ విత్తన కంపెనీ యజమానులే స్వీయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి ప్రభుత్వానికి విత్తన కాయలు అమ్ముతున్నారనీ ఫలితంగా నాసిరకం విత్తనాల వల్ల పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయి రైతులు నష్ట పోతున్నారన్నారు. విత్తనకాయలకు ఇచ్చే 40 శాతం సబ్సిడీ కూడా దళారులకు కట్ట బెడుతున్నారు. తప్ప రైతులకేమీ తక్కువ ధరకు వేరుశనగ ఇవ్వడం లేదు బహిరంగ మార్కెట్లో ధర ఎంతుందో ప్రభుత్వం ఇచ్చే ధర కూడా అంతే ఉంటోందన్నారు.

పోలవరం నిర్వాసితుల పునరావాసం కోసం

20 నుంచి మహాపాదయాత్ర

సీపీఐ(యం) రాష్ట్ర కమిటీ నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాస చర్యల కోసం జూన్ 20 నుంచి మహాపాదయాత్ర నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. త్వరలో వర్షాకాలం రానున్న నేపథ్యంలో గోదావరి వరదలు ముంచెత్తే ప్రమాదం ఉన్నందున సహాయ కార్యక్రమాల కోసం ముందస్తు చర్యలు తీసుకొని యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశం వై.వెంకటేశ్వర రావు అధ్యక్షతన విజయవాడలో శుక్రవారం జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్‌కరత్, యంఏ బేబి, బీవీ రాఘవులు సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితిని సమీక్షించి పార్టీ పురోగమనానికి చర్యలపై రాష్ట్ర కమిటీ నిర్ణయాలు తీసుకున్నది. గత సంవత్సరం జులైలో గోదావరికి వచ్చిన వరదల నుండి ప్రజలు ఇంత వరకూ కోలుకోలేదు. ముఖ్యంగా పోలవరం మునక ప్రాంతాల్లోని 8 మండలాల ప్రజలు ఎటువంటి అభివృద్ధికి, సంక్షేమానికి నోచుకోక అడవుల్లో చెట్లు, పుట్టల పాలై బతుకుతున్నారు. పోలవరం డ్యాం పూర్తికాకముందే గత జులై వరదలతో వందలాది గ్రామాలు మునిగిపోయాయి. ఈ వరదల్లో మునిగిపోయిన గ్రామాల ప్రాతిపదికపై పోలవరం నిర్వాసితుల పునరావాసానికి చర్యలు తీసుకోవాలి. ఇంతవరకు పునరావాసానికి నిధులు ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం రీసర్వే పేరుతో మరొక 32 గ్రామాలను కొత్తగా చేర్చింది. 41.15 మీటర్ల వద్ద మునుగుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామాలకు వాస్తవంగా గత వరదల్లో మునిగిన గ్రామాలకు పొంతనే లేదు. రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల్లో (అల్లూరి జిల్లా, ఏలూరు జిల్లా) పాత, కొత్త కలిపి 45 ముంపు గ్రామాలుగా ప్రకటించింది. కానీ వాస్తవానికి గత సంవత్సరం వరదల సమయంలో 150 గ్రామాలు ముంపునకు గురయ్యాయి. పునరావాస కాలనీలు సైతం ఈ వరదల్లో మునిగిపోయిన వాస్తవాన్ని గమనిస్తే ఈ కాంటూరు లెక్కలు ఎలా తప్పుల తడకో అర్థమవుతుంది. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి రావడంతోనే నష్టపరిహారాన్ని రూ.6.5 లక్షల నుండి 10 లక్షలకు పెంచుతామని వాగ్దానం చేశారు. కానీ ఇంత వరకూ అమలు చేయలేదు. ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ పునరావాస ప్యాకేజీ అందించాలి. పూర్తిస్థాయి పునరావాసం అమలయ్యే వరకు మునక ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగించాలి. ఈ డిమాండ్ల సాధన కోసం జూన్ 20 నుండి మహాపాదయాత్ర నిర్వహించాలని నిర్ణయించినట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ పాదయాత్రకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించాలని ప్రజానీకానికి విజ్ఞప్తి చేశారు.

కార్యదర్శివర్గ సభ్యులుగా రాంభూపాల్, ఉమామహేశ్వరరావు

కొత్తగా వి.రాంభూపాల్, వి.ఉమామహేశ్వరరావులను కార్యదర్శివర్గ సభ్యులుగా సీపీఎం రాష్ట్ర కమిటీ ఎన్నుకున్నది. ఇప్పటి వరకు ఆహ్వానితులుగా ఉన్న కిల్లో సురేంద్ర, కె.సుబ్బారావమ్మ పూర్తిస్థాయి కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ ఆహ్వానితులుగా ఉన్న కె.ఉమామహేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా పార్టీ కార్యదర్శి అప్పలనర్స, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవిలను రాష్ట్ర కమిటీ సభ్యులుగా కో-ఆప్ట్ చేసుకున్నారు.

సంపాదకీయం

నీతి ఆయోగ్‌లో అపస్వరాలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన శనివారం జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి 11 రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరు కాకపోవడం వెనక కారణం ఏమిటో స్పష్టంగా తెలుస్తూనే ఉంది. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికైన ఇతర రాజకీయ పార్టీల అధీనంలోని ప్రభుత్వాలను మోదీ సర్కారు నిరంతరం వేధిస్తూనే ఉంది. అన్ని రాష్ట్రాలకు సంబంధించిన అభివృద్ధి ప్రణాళికలను ఖరారు చేసే ఈ సమావేశాలకు హాజరు కాని ముఖ్యమంత్రులందరూ బీజేపీయేతర పక్షాలకు చెందిన వారే. వీరిలో అందరూ మోదీ ప్రభుత్వాన్ని, ఆయన నాయకత్వంలో కొనసాగుతున్న పరిపాలనా విధానాన్ని ఒకే రీతిలో చూడడం లేదన్నది కూడా సత్యమే. బీజేపీకి, ప్రతిపక్ష పార్టీలకు సమాన దూరం పాటిస్తున్నానని చెప్తున్న ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ కూడా నీతీ ఆయోగ్ సమావేశానికి హాజరు కాలేదు. అంటే సాధారణంగా మోదీ సర్కారుకు మద్దతిచ్చే పట్నాయక్ గైరు హాజరు కావడం చూస్తే మోదీ సర్కారుతో ఆయనకు ఉన్న విభేదాలు కేవలం రాజకీయమైనవి కావని తేలిపోతోంది. నీతి ఆయోగ్ సమావేశంలో తమ రాష్ట్రానికి సంబంధించిన అంశాలు చర్చకు వస్తాయని తెలిసినా నవీన్ పట్నాయక్ హాజరు కాకపోవడం వెనక మోదీ ప్రభుత్వ వ్యవహార సరళిపై ఆయనకు అసంతృప్తి ఉందనే. నీతీ ఆయోగ్ సమావేశానికి హాజరుకాని ముఖ్యమంత్రులందరూ హాజరు కాకపోవడానికి ఒకే కారణం చూపలేదు. కానీ ఎవరి అభ్యంతరాలు వారికి ఉన్నాయి. అయితే ఈ అభ్యంతరాలను వ్యక్తం చేయడంలో హాజరుకాని ముఖ్యమంత్రుల్లో కొందరు చూపిన కారణాలు సమంజసంగా కనిపించడం లేదు. రాజస్థాన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తాను హాజరు కాకపోవడానికి అనారోగ్యం కారణం అంటున్నారు. అంటే ఆరోగ్యం సహకరిస్తే వచ్చే వారనేగా. అప్పుడు మోదీ సర్కారు పని విధానాన్ని వ్యతిరేకించడం లేదనుకోవాలా? కేరళలో అధికారంలో ఉన్న వామపక్ష ఫ్రంట్ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తాను ఎందుకు హాజరు కాలేదో ఏ కారణమూ చెప్ప లేదు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మాత్రం ఢిల్లీ పరిపాలనాధికారాలను కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన ఆర్డినెన్సే తాను హాజరు కాకపోవడానికి కారణం అని నిర్మొహమాటంగా తెలియజేశారు. మోదీ హయాంలో ఫెడరలిజం హాస్యాస్పదమైన అంశంగా మారిందని కేజ్రీవాల్ అంటున్నారు. ఢిల్లీ సంపూర్ణమైన రాష్ట్రం కాకపోవచ్చు. కానీ అది మిగతా కేంద్ర పాలిత రాష్ట్రాల్లాంటిది కాదు. పుదుచ్చేరి కేంద్ర పాలిత ప్రాంతానికి ఉన్నట్టుగానే ఢిల్లీకి శాసనసభ ఉంది. మంత్రివర్గమూ ఉంది. పుదుచ్చేరి ముఖ్యమంత్రికి ఎదురుకాని సమస్యలు ఢిల్లీ ముఖ్యమంత్రి ఎదుర్కోవలసి వస్తోంది. ఇతర పార్టీల ప్రభుత్వాలను ఖాతరుచేయని విధానం మోదీ సర్కారు ప్రత్యేకత. ఈ నెల 11న సుప్రీంకోర్టు ఢిల్లీ పరిపాలనా విభాగంపై మంత్రివర్గానికి సంపూర్ణ అధికారం ఉంటుందని తీర్పు ఇచ్చింది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా మోదీ ప్రభుత్వం ఆ తీర్పు అమలు కాకుండా ఆర్డినెన్సు జారీ చేసింది. దీన్నిబట్టి ఢిల్లీ ప్రభుత్వంపై మోదీ సర్కారు వైఖరి ఏమిటో తేలిపోతోంది. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరు కాని తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు (కె.సి.ఆర్.) శనివారం ఈ ఆర్డినెన్సును తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ఆర్డినెన్సును మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకుంటేనే మర్యాదగా ఉంటుందని లేకపోతే లోకసభ, రాజ్యసభలో ఈ ఆర్డినెన్సుకు వ్యతిరేకంగా కావలసిన మద్దతు కూడగడ్తామని కె.సి.ఆర్. నిర్మొహమాటంగానే చెప్పారు. మోదీ పాలన తీరు ఎమర్జెన్సీ రోజులను గుర్తు చేస్తోందని ఆయన దుయ్యబట్టారు. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌మాన్‌తో కలిసి ఆయన ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఢిల్లీ ప్రభుత్వానికి ఉన్న పాలనాధికారాలను హరించి అభాసుపాలు కావొద్దని కె.సి.ఆర్. చేసిన సూచన మోదీ సర్కారు తలకెక్కుతుందన్న ఆశ్యాశ అనవసరం.

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా నీతి ఆయోగ్ సమావేశానికి దూరంగానే ఉన్నారు. ఈ సమావేశానికి హాజరు కాని ముఖ్యమంత్రుల వల్ల ఆ రాష్ట్రాల ప్రయోజనాలకే భంగం కలిగిస్తాయని బీజేపీ అధికార ప్రతినిధి రవి శంకర్ ప్రసాద్ వ్యాఖ్యానించడం కేంద్ర ప్రభుత్వ అహంకారానికి నిదర్శనం. అసలు నీతి ఆయోగ్ సమావేశాలకు రవి శంకర్ ప్రసాద్‌కు సంబంధం ఏమిటో అంతుపట్టదు. మోదీని ఇంకెంత కాలం వ్యతిరేకిస్తారు, విమర్శిస్తారు అని రవిశంకర్ ప్రసాద్ ప్రశ్నిస్తున్నారు. ఇంతకన్నా ఆశ్చర్యం ఏముంటుంది. మోదీ సర్కారు అనుసరిస్తున్న ప్రజాస్వామ్య వ్యతిరేకత ఎంత వినాశకరమైందో ఆలోచిస్తే భవిష్యత్తు అంధకార బంధురంగా కనిపిస్తుంది. నీతి ఆయోగ్ సమావేశం జాతీయ అభివృద్ధి క్రమాన్ని నిర్ణయించే మాట నిజమే. కానీ నీతి ఆయోగ్‌కు నాయకత్వం వహించే వారికి రాజకీయ అభిప్రాయాలతో, విభేదాలకు అతీతంగా అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను వెంట తీసుకుపోవలసిన బాధ్యతను విస్మరించలేం. ఈ విషయంలోనే మోదీ సర్కారు చేయవలసిన పనిచేయడం లేదు. సమావేశానికి హాజరుకాని ముఖ్యమంత్రులు అధికారంలో ఉన్న రాష్ట్రాలు నష్టపోతాయనడం అహంకారానికి పరాకాష్ఠ. కేంద్ర ప్రభుత్వం నిర్వాకంవల్లే ఎనిమిది రాష్ట్రాల ముఖ్యమంత్రులు శనివారం నాటి సమావేశానికి గైర్హాజరు కావలసి వచ్చింది. బీజేపీయేతర రాజకీయ పక్షాల అవసరాలను తీర్చే బాధ్యత ఉన్న నీతి ఆయోగ్‌ను నిర్వీర్యం చేస్తున్నారు. ముఖ్యమంత్రులు హాజరు కాకపోవడం అంటే తమ రాష్ట్రాల అభివృద్ధిని బహిష్కరించడమేనంటున్నారు. అంటే తమ పెత్తనాన్ని ఆమోదించని ఎవరినీ సహించే ఓపిక మోదీ ప్రభుత్వానికి లేనేలేదు. రవిశంకర్ ప్రసాద్ మాట తీరుచూస్తే మోదీని వ్యతిరేకించే వారెవరినీ ఆమోదించే సహనం ఏకోశానా కనిపించదు. నీతి ఆయోగ్ బాధ్యత మొత్తం దేశం అభివృద్ధికి పాటు పడడం. కానీ తమ కార్యకలాపాలకు సమ్మతించని వారిని బెదిరించే ధోరణిలో మోదీ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ప్రణాళికా సంఘం పేరును నీతి ఆయోగ్‌గా మార్చడంలోనే మోదీ వ్యక్తిత్వంలోని ఆధిపత్య ధోరణి వ్యక్తమైంది.

ఈ సమావేశంలో వంద అంశాలను చర్చించారట. నిజమే కావచ్చు. కానీ సకల విషయాలనూ తమ అభిప్రాయానికి అనుగుణంగానే అంతా సాగాలనడం అత్యంత అప్రజాస్వామికం. తమను వ్యతిరేకించే ముఖ్యమంత్రులున్న రాష్ట్రాలలో అభివృద్ధికి అవకాశం ఉండదు అన్నదే మోదీ సర్కారు నిశ్చితాభిప్రాయం. అయితే దీన్ని కచ్చితంగా వ్యతిరేకించవలసిందే. అభివృద్ధి పంథాలో భిన్నాభిప్రాయాలు ఎప్పుడూ ఉంటాయి. వాటిని విని సమన్వయ దృక్పథం ప్రదర్శించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. మోదీ సర్కారులో లేనిదే ఈ విశాల దృక్పథం. దేశాభివృద్ధి ఏ ఒక్క నాయకుడి, లేదా పార్టీ గుత్త సొత్తు కాదు.

రాష్ట్రపతి ఎన్నికలోనే ప్రజాప్రాతినిధ్యం అధికం

దేశ ప్రధాని నూతన పార్లమెంటు భవనం ప్రారంభించడం ఏ మాత్రం సముచితం కాదు. అది ప్రజాస్వామ్య దేశంలో ప్రజలందరు ఎన్నుకున్న దేశ రాష్ట్రపతి ప్రారంభించడమే సముచితం. అయితే కోర్టులతో సహా కొందరు దేశ ప్రజలందరు ఎన్నుకున్న ప్రధాని ప్రారంభించడం సముచితమే అంటున్నారు. కానీ, ప్రధానిని దేశ ప్రజలందరు ఎన్నుకోలేదు. ప్రతిపక్ష పార్లమెంటు సభ్యులు ఎన్నుకోలేదు. కేవలం అధికారంలోఉన్న బీజేపీ ఎంపీలు మాత్రమే ఎన్నుకున్నారు. ఒక్క రాష్ట్రపతిని మాత్రమే దేశంలో ఉన్న ప్రజా ప్రతినిధులందరు ఎన్నుకున్నారు. దేశంలో ఉన్న ప్రతి ఎంపి, ప్రతి శాసనసభ్యుడు, రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేశారు. అందువల్ల దేశ ప్రజలందరికి సంబంధించిన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించే అర్హత ఒక్క రాష్ట్రపతికే ఉంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో దేశ పౌరుడే కేంద్ర బిందువు. వ్యవస్థలు, రాజకీయ పార్టీలు ప్రజల కోసం ఏర్పడినవి. అందువలన సమాజంలో మనిషే కేంద్రబిందువు. ప్రస్తుతం అలాకాక మనిషితో సంబంధం లేకుండా మనిషి కోసం చట్టాలు చేస్తున్నారు. ప్రజలకు మంచి పాలన అందించవలసిన వారు ప్రజావ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటున్న ప్రభుత్వాలు దేశంలో ఏలుబడి సాగిస్తున్నాయి.

పార్లమెంటు భవన ప్రారంభంలో సర్వమత ప్రార్థనలు చేస్తారట. లౌకిక రాజ్యాంగంలో ప్రతిమతాన్ని సమానదృష్టితో చూడమన్నారు గాని అన్ని మతాలను ప్రోత్సహించమనలేదు. మతం వ్యక్తిగతమే కాని సమాజపరం కాకూడదు. పాలకులు మతాలను, కనపడని దేవుళ్లను పూజించి ప్రోత్సహించడం సెక్యులర్ స్టేటుకు విరుద్ధం. ఎవరి మతాన్ని వారు ప్రోత్సహించుకోవచ్చు. అది వ్యక్తిగతంగా ఇంటికే పరిమితం కావాలి. కానీ అన్ని మతాలకు సంబంధించినచోట ఒక మత వ్యాప్తికి ప్రభుత్వం ప్రోత్సహించరాదు. ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రజలవే అనే సంగతి మరువరాదు. ప్రజలందరికి సంబంధించిన ప్రభుత్వ కార్యాలయాల్లో ఒక్క హిందూ మతానికి సంబంధించిన శ్రీ వేంకటేశ్వరుని ఫొటోలు పెట్టడం సమంజసం కాదు. క్రైస్తవులు, ముస్లింలు మన దేశంలో మైనారిటీలు కావడం వలన తలొంచి ఊరుకుంటున్నారుగానీ వారు కూడా తమ దైవం ఫొటోలు ప్రభుత్వ కార్యాలయాల్లో బస్సు స్టాండుల్లో పెట్టమని పోరాటం చేస్తే అది ప్రభుత్వానికి తలనొప్పిగ మారవచ్చు. ప్రధాని మోదీ మాటల మాంత్రికుడు. మాటలతో గారడి విద్యను ప్రదర్శించి ప్రజలను మోసం చేస్తున్నాడు. ప్రజలు నమ్మి ఎన్నుకున్న ప్రభుత్వాధినేతలు ప్రజల ఆస్తులను స్నేహితులకు దారాదత్తం చేసే హక్కు ప్రజలు ఓటు ద్వారా కల్పించలేదు. ప్రజలెన్నుకున్నంత మాత్రాన ప్రజల ఆస్తులు పరిశ్రమాధిపతులకు, స్నేహితులకు దారాదత్తం చేసి ప్రజలను మోసగించడం సమంజసమా. ఎల్ఐసీ, ప్రభుత్వ బ్యాంకులలో ప్రజలు నమ్మి దాచుకున్న సొమ్ము స్నేహితుడైన అదానీకి తదితర ఆశ్రితులకు ఇవ్వడం సమంజసమా? ఎన్నుకున్న ప్రజలను మోసం చేయడం కాదా? ప్రజాస్వామ్య విలువలను నీరుగార్చి, విలువల్ని నాశనంచేసి ప్రజాహిత సంస్థల్ని బలహీనపరచి దాడులు చేయడం సమంజసమా?

ఇదిలా ఉండగా కొత్తగా రాజదండం ఒకటి వచ్చిపడింది. రాజరిక వ్యవస్థలోని రాజదండం ప్రజాస్వామ్య వ్యవస్థకు అవసరమా. రాజదండం ప్రథమ ప్రధాని నెహ్రూ చేతికర్రగా వాడుకున్నారన్న ప్రచారం శుద్ధ అబద్ధం. మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని గొప్పలు చెప్పుకుంటాం. అలాంటప్పుడు రాచరిక వ్యవస్థలోని రాజదండం ఎందుకో సామాన్యులకు అర్థం కావడం లేదు. బలహీనవర్గాల మనిషినని పేద ప్రజలకోసమే తన సేవలని, పేదలను, ఉద్ధరించడానికే పుట్టినట్లు ఎన్నికల ప్రచారంలో మాట్లాడి పేదలకిచ్చే సంక్షేమ కార్యక్రమాల నిధులకు కోత పెట్టడం ఏమనుకోవాలి. కోవిడ్ మరణాలకు సంబంధించి రెండు లక్షలున్నారు. ఆ తరువాత యాభైవేలన్నారు. మరణించిన కుటుంబానికి ఇంతవరకు ఒక్క పైసా ఇవ్వలేదు. ఇదంతా మాటలతో గారడి చేయడమేకదా. ఇప్పటికైనా ప్రజలకిచ్చిన వాగ్దానాలు నెరవేర్చేరకంగా రాజకీయ పార్టీలు మారాలి.

బి.రాధాకృష్ణ
సెల్: 9885569394

తొమ్మిదేళ్లలో సాధించిందేమున్నది?

నీరుకొండ ప్రసాద్

ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చి మే 26 వ తేదికి తొమ్మిదేళ్లు పూర్తి అయింది. దేశ ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన మోదీ అసమర్థ, అసంబద్ధ పాలనా విధానాల ద్వారా దేశ ఆర్థిక, సామాజిక జనజీవనాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారు. 2014 ఎన్నికల్లో అభివృద్ధి ఎజెండాతో కొత్తతరం నేతగా మోదీ తెరపైకి వచ్చారు. ఆర్భాట ప్రసంగాలు, అమోఘమైన వాగ్దానాలు, హావభావ విన్యాసాలు, ఆచరణ ఎరుగని ఆదర్శాలతో దేశ ప్రజలను బురిడి కొట్టించి అధికారంలోకి వచ్చిన మోదీ దేశాన్ని అన్నివిధాలా అధోగతి పాలు చేశారు. 2014 ఎన్నికలకు ముందు ప్రజలు తీవ్రంగా ఎదుర్కొంటున్న వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, అవినీతి అంశాలను ఎన్నికల అస్త్రాలుగా మలుచుకున్నారు. దేశంలోని అవినీతిపరులు దేశ సంపదను లూటీచేసి స్విస్ బ్యాంకుల్లో లక్షల కోట్లు దాచుకున్నారని, దాన్ని తెప్పించి ఒక్కొక్కరి ఖాతాలో 15 లక్షల రూపాయలు వేస్తానని మోదీ వాగ్దానం చేసారు. దేశంలో అత్యధికమంది ఆధారపడివున్న వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు మోదీ ప్రభుత్వం చెయ్యని ప్రయత్నం లేదు. ప్రభుత్వ విధానాల వల్ల విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల ధరలు భారీగా పెరిగిపోయాయి. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు వ్యవసాయాన్నే మానేసే పరిస్థితి తెచ్చారు. వ్యవసాయ సంక్షోభం తీవ్రరూపం దాల్చి కోట్లాది మంది వ్యవసాయ రంగాన్ని వదిలేస్తున్నారు. రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే వున్నాయి. కేంద్ర నేర పరిశోధనా సంస్థ నివేదిక ప్రకారం 2016లో 11,379 మంది రైతులు ఆత్మహత్య చేసుకోగా, 2017లో 10,655 మంది, 2018లో 10,349 మంది, 2019లో 10,281 మంది, 2020లో 10,677 మంది, 2021లో 10,881 మంది, 2022లో పది వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయ కూలీలకు జీవనాధారంగా వున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని బలహీన పరిచారు.

మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఒక్కసారి కూడా మీడియా సమావేశం జరపలేదు. తొమ్మిదేళ్ల నాడు చెప్పిన దానికి, చేసిన దానికి ఎక్కడా పొంతన లేదు. తొమ్మిదేళ్లుగా అసత్యమేవ జయతే అన్న రీతిగా సాగుతుంది పాలన. వాగ్దానాల వరద పారించారు తప్ప అవి వాస్తవరూపం దాల్చలేదు. ఆకలి, అవిద్య, అనారోగ్యం, మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధి వంటి ప్రాథమిక సమస్యలు పరిష్కరించలేక పోయారు. సమాఖ్య భావనకు తూట్లు, రాజ్యాంగ వ్యవస్థలపై దాడులు, ప్రశ్నించే గళాలకు సంకెళ్ళు నిత్యకృత్యమయ్యాయి. దేశాన్ని తిరోగమనబాట పట్టించారు. కాంగ్రెస్ పార్టీకి 60 ఏళ్ళు అధికారం ఇచ్చారు. నాకు 60 రోజులు చాలు అచ్ఛేదిన్ తెస్తాను అని దేశ ప్రజలను నమ్మించారు. నేడు అచ్ఛేదిన్ అంటూ ఆశలుపెట్టి ఆవిష్కరించిన సుందర స్వప్నం కరిగిపోయింది. మోదీ పాలన మేడిపండును తలపిస్తుంది. మేక్ ఇన్ ఇండియా, డిజిటల్ ఇండియా, స్మార్ట్ సిటీస్, స్టార్టప్ ఇండియా, స్కిల్ ఇండియా, పసల్ బీమా విఫలమయ్యాయి. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల కల్పన దగా. ఆర్థిక నేరగాళ్ళపై చర్యలు అంటూ ఆర్థిక నేరగాళ్లను అక్కున చేర్చుకోవడం, చట్టాలను చుట్టాలుగా మార్చుకోవడం, ప్రశ్నిస్తున్న వారి గొంతులు నులమడం వంటి చర్యలతో పాలన సాగించారు. తొమ్మిదేళ్లుగా గతాన్ని తవ్వడం తప్ప దేశానికి తాను ఏం చేశారో మోదీ చెప్పలేని దుస్థితి. తాను మాత్రమే దేశ భక్తుడుగా ప్రచారం చేసుకొంటారు. ఏది రాజకీయంగా ఉపయోగపడితే దానిని ఉపయోగించుకొన్నారు. దేశాభివృద్దే లక్ష్యంగా తానూ పనిచేస్తున్నానని మోదీ చెప్పే మాటలు డొల్ల అని తొమ్మిదేళ్ల పాలన రుజువుచేసింది. 2016 లో పెద్దనోట్లు రద్దుతో నల్లధనం రూపుమాపుతాం, అవినీతి అంతం అవుతుంది అన్నారు. 2017లో సర్జికల్ స్ట్రైక్ తరువాత దేశంలో ఉగ్రవాదం వుండదు అన్నారు. 2018లో జీఎస్టీతో అద్భుతాలు జరిగి ధరలు తగ్గి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయన్నారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు తరువాత కాశ్మీర్ ప్రశాంతంగా వుంటుంది అన్నారు. 2020లో 21 రోజులు ఇంట్లో వుండండి, దీపాలు వెలిగించండి, చప్పట్లు కొట్టండి కరోనా పారిపోతుంది అన్నారు. 2020లో నన్ను నమ్మండి ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మితేనే దేశం బాగుపడుతుంది అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బీమా సంస్థలు, రైల్వేలు, పోర్టులు ఇలా అనేక వ్యవస్థలను అమ్మకానికి పెట్టారు. మేడ్ ఇన్ ఇండియా అంటు ఊదర గొట్టి సేల్ ఇండియా చేస్తున్నారు.

నిత్యావసర వస్తువుల ధరలు, వంటగ్యాస్ ధరలు, వంట నూనెల ధరలు మంటలు మండుతున్నాయి. ఆ మంటల్లో సామాన్య, మధ్య తరగతి ప్రజల జీవితాలు విలవిలలాడుతున్నాయి. మోదీ పాలనకు ముందు వంట గ్యాస్ రూ.405 ఉంటే నేడు రూ.1175 అయింది. పెట్రోలు రూ.70 నుండి 110కి, డీజల్ రూ.55 నుండి రూ.97కు, వంట నూనె రూ.83 నుండి రూ.175కు పెరిగిపోయాయి. డీజీలు,పెట్రోలు ధరలు పెరగడంతో వ్యవసాయ అనుబంధ రంగాలు పూర్తిగా దివాళా తీసాయి. రైతులకు ఏం చేయాలో దిక్కు తోచడంలేదు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న ఎన్నికల హామీ నెరవేరలేదు. మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్, గరీబ్ కళ్యాణ్ యోజన, ప్రధానమంత్రి కృషి సంచయ్ యోజన, వన్ నేషన్, వన్ రేషన్, ఏక్ భారత్, శ్రేష్ట భారత్ అంటూ నోరు తిరగని ఆర్భాటపు ప్రకటనలతో కడుపునింపుతున్నారు. ప్రపంచ ఆహార సూచికలో భారత్ 107వ స్థానానికి చేరింది. అవినీతి, రాజ్యాంగ సంస్థల దుర్వినియోగం, ప్రజాస్వామ్య హక్కులపై దాడి, న్యాయస్థానాలను బలహీనంచేసే చర్యలు. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాల కాలంలో ఈ దేశాన్ని పాలించిన వివిధ ప్రభుత్వాలు చేసిన అప్పులు 2021 డిసెంబర్ నాటికి రూ 135 లక్షల కోట్లకు చేరగా, 2023 నాటికి 155 లక్షల కోట్లకు చేరనున్నాయని అంచనా. అంటే దాదాపు ప్రతీ నెలా రూ.83 వేల కోట్ల రూపాయలు అప్పులు చేస్తున్నారు. ఈ అప్పులన్నీ ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి? ఏమవుతున్నాయి? అనే ప్రశ్నకు సమాధానం లేదు. పదే,పదే అధికారం చేజిక్కించుకునేందుకు ఉచిత పథకాలు అనర్హులకు అందించి దేశాన్ని అప్పులపాలు చేస్తున్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ఇంత అప్పుచేసి దేశానికి ఏం చేసినట్లు? ఇంత అప్పు వల్ల వచ్చిన ఫలితాలు ఏమిటో మోదీ చెప్పగలరా? భారత్ రేటింగ్ మాదిరి మిగిలిన దేశాలతో పోలిస్తే భారత్ అప్పు ఎంతో ఎక్కువగా వుందని మూడీస్ రేటింగ్ సంస్థ వెల్లడించింది. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో కెల్లా భారత దేశంలోనే అత్యధికంగా ప్రజలు పేదరికంలోకి జారుకున్నారని ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించడంతో మోదీ ప్రసంగాలు, పరిపాలన అంతా డొల్ల అని తేలిపోయింది.

– సెల్: 9849625610

నెహ్రూ భరతమాత ముద్దు బిడ్డ -వాజ్‌పేయి

డాక్టర్ దేవరాజు మహారాజు

పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మరణించినపుడు అటల్ బిహారీ వాజ్‌పేయి అర్పించిన నివాళి ఈ విధంగా ఉంది. "ఒక కల విచలితమైంది. ఒక పాట మూగబోయింది. ఒక జ్వాల అనంతంలో కలిసిపోయింది. భయం, ఆకలి లేని ఒక ప్రపంచపు కల అది. ఇటు గీతా పాఠాన్ని ప్రతిధ్వనించే గీతం ఇది. అటు రోజా పువ్వు వెదజల్లే పరిమళం అది. ఎదురైన ప్రతి చీకటితో పోరాడుతూ, వెలుగులీనుతూ, ప్రతిరాత్రీ మేల్కొని మండుతూ ఉన్న దీపం అది. మాకుదారి చూపుతూనే ఒకనాటి ఉదయం నిర్వాణం చెందింది. మరణం తప్పదు. భౌతిక శరీరం తాత్కాలికం. ఆ బంగారు శరీరం నిన్న గంధపు చెక్కల మధ్య మాయమైంది. కానీ, ఆ మృత్యువు ఎందుకంత తొందరపడిందీ? స్నేహితులంతా నిద్రలో ఉన్నప్పుడు, పహారా కాస్తున్నవారు ఒకింత మగతగా ఉన్నప్పుడు జీవితంలో మాకు ఎంతో విలువైన ఆ బహుమతిని నిర్దాక్షిణ్యంగా లాక్కుపోయిందే? భరతమాత విషాదంలో మునిగిపోయింది. తన ముద్దుల బిడ్డను, ప్రియతమ రాకుమారుణ్ణి ఆమె ఈ రోజు కోల్పోయింది. తన అనుచరుణ్ణి, తన సహచరుణ్ణి కోల్పోయానని...మానవత్వం ఈ రోజు ఖిన్నవదనంతో ఉంది. తన పరిరక్షకుడు ఇక లేడని.. శాంతి ఈ రోజు సహనం కోల్పోయింది. అణగారిన బతుకులకు అండలేకుండా పోయింది. సామాన్యుడి కళ్లలో వెలుగులు ఆరిపోయాయి. తెరపడిపోయింది. ప్రపంచ రంగస్థలం మీది నుంచి ముఖ్యమైన నటుడు తన చివరి పాత్ర పోషించి, ప్రేక్షకుల ముందు సెలవు తీసుకుని నిష్క్రమించాడు."



వాజ్‌పేయి కవి. భావోద్వేగంలో ఆయన చెప్పిన ఈ మాటలు కేవలం ఆనవాయితీగా చెప్పిన పొడిమాటలు కావు. గుండె లోతుల్లోంచి తన్నుకుని వచ్చినవని తెలుస్తూనే ఉంది. పార్టీలు వేరైనా, రాజకీయంగా భేదాభిప్రాయాలున్నా ఒక మహామనిషి కనుమరుగైనప్పుడు ఆయన వ్యక్తిత్వాన్ని నిజాయితీగా వ్యక్తీకరించాలి. ఆ పనిని బీజేపీ అగ్రనేత వాజ్‌పేయి చేశారు. నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు వాజ్‌పేయి విమర్శను ఆహ్వానించి ప్రోత్సహించారు. ఇందిరాగాంధీ తర్వాత వేర్వేరు వ్యక్తులు ప్రధానులయ్యారు. పార్లమెంటు హౌస్‌లో ఎవరో నెహ్రూ చిత్రపటాన్ని తొలగించారు. అది గమనించిన వాజ్‌పేయి కలతచెందారు. ఏదిఏమైనా, దేశతొలి ప్రధానిగా ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వాల్సిందేనని గొడవచేసి మళ్లీ నెహ్రూ చిత్రపటాన్ని అక్కడ యథావిధిగా ఏర్పాటు చేయించారు. ప్రధానిగా వాజ్‌పేయి పార్లమెంటులో చేసినొక ఉపన్యాసంలో ఆయనే స్వయంగా ఈ విషయం తెలియజేశారు. అందుకే రాజకీయాల్లో ఉన్నవారంతా రాజకీయనీతిజ్ఞులు కారు. నేటి వాజ్‌పేయి వారసులు ఎక్కడ ఏ స్థాయిలో ఉన్నారో ఆలోచించుకోవాలి!

భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మీద ఆర్ఎస్ఎస్, బీజేపీ నేతలు తమ అక్కసు అన్ని విధాలా వెళ్లగక్కుతున్నారు. "ఈ దేశానికి తొలిప్రధాని నెహ్రూ బదులుగా సర్దార్‌వల్లభాయ్ పటేల్ అయి ఉంటే కశ్మీరు పరిస్థితి, దేశపరిస్థితి వేరుగా ఉండేదని, కశ్మీరులో కొంతభాగం పాకిస్థాన్ ఆధీనంలో ఉండేది కాదనీ- లోకసభలో స్వయంగా నేటి ప్రధాని మోదీ ప్రకటించారు. భారత తొలి హోం మంత్రి సర్దార్ పటేల్‌కు తామే నిజమైన వారసులమని ప్రతిచోట ప్రకటించుకుంటున్నారు. పదవులున్నాయి. నోటికి పెదవులున్నాయి కదా అని తోచిందల్లా మాట్లాడితే దేశప్రజలు నమ్మేపరిస్థితిలో లేరు. అంతో ఇంతో చరిత్ర, భూగోళం, సైన్సు, ప్రపంచజ్ఞానం పెంచుకుని, ఇంగిత జ్ఞానంతో ఆలోచిస్తున్న సామాన్యుల సంఖ్య పెరిగింది. వారు అన్నీ విశ్లేషించుకుంటున్నారు. ఎవరైనా సరే, ఆకాలానికి, ఆ సమయానికి, ఆ సందర్భానికి తగిన నిర్ణయాలు మాత్రమే తీసుకుంటారు. జనానికి, దేశానికి మేలు చేసినవారు చరిత్రలో నిలబడతారు. కీడు చేసినవారు చరిత్ర హీనులవుతారు. స్వాతంత్ర్యం లభించిన నాటికి దేశంలో నెహ్రూ స్థాయి ఏమిటీ? వల్లభాయ్‌పటేల్ స్థాయి ఏమిటీ? అనేది కొన్ని పాత ఉత్తరాలవల్ల తెలుసుకోవచ్చు. వాజ్‌పేయి శ్రద్ధాంజలితో కొంత అర్థమవుతోంది కదా? దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేనాటికి జవహర్‌లాల్‌నెహ్రూ తిరుగులేని అగ్రనాయకుడు. ఆయన దార్శనికుడు గనుక, దేశ అవసరాలకు కావల్సిన ప్రాజెక్టులకి, వైజ్ఞానిక పరిశోధనాశాలల స్థాపన, వైజ్ఞానికుల్ని ప్రోత్సహించడం, ప్రభుత్వ విధానాలపై విమర్శల్ని ఆహ్వానించడం, లలిత కళల్ని, బాలల అవసరాల్ని గుర్తించడంలో ఆయనకు ఆయనే సాటి. పద్నాలుగేళ్లు జైల్లో మగ్గినా, భార్య చనిపోయి ఒంటరివాడైనా, మొక్కవోని దీక్షతో తనను తాను దేశానికి అర్పించుకున్న ధీశాలి. ఇప్పటి బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థలు పనిగట్టుకుని నెహ్రూ కృషిని, నిర్ణయాల్ని తక్కువచేసి మాట్లాడడం వారి సంస్కారహీనతను తెలియజేస్తుంది తప్ప, తొలి ప్రధాని ముద్రను చెరిపేయలేవు. మహాత్మాగాంధీ, నెహ్రూని అక్రమంగా, దొడ్డిదారిన ప్రధానిని చేశారని నేటి ప్రభుత్వ నేతలు అడ్డదిడ్డంగా మాట్లాడుతున్నారు. ఆ కాలంలో నెహ్రూ స్థాయి ఏమిటో, సర్దార్ పటేల్ స్థోమత ఏమిటో అర్థం చేసుకునే పరిస్థితిలో కూడాలేరు.

దేశంలో ఆకలి, పేదరికం రూపుమాపాలంటే, దేశం వైజ్ఞానికంగా అభివృద్ధి సాధించాలని కలలుగన్నవాడు నెహ్రూ. విద్యావంతుల్ని, అందులో వివేకవంతుల సంఖ్య పెంచడం, సంస్కృతీ సంప్రదాయాల గుప్పిట్లో ఉన్న మూఢనమ్మకాల్ని తగ్గించడం తక్షణం చేయాల్సిన పనులని ఆయన ఉద్బోధించారు. హోమి జె.బాబా, శాంతి స్వరూప్ భట్నాగర్, సర్ సి.వి.రామన్, సతీష్ థావన్, జె.సి. ఘోష్, మేఘనంద్ సాహా, నళినీ రాజన్ శంకర్ లాంటి వైజ్ఞానికుల్ని ఆయన స్వయంగా ప్రోత్సహించి వారి చేత ప్రపంచస్థాయి పరిశోధనా శాలలకు రూపకల్పన చేయించడం సామాన్యమైన విషయంకాదు. ఎంతటి దార్శనికుడయితే నెహ్రూ ఆ పనులు చేయగలిగారూ? బ్రిటీష్ భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ గ్రహీత అయిన పాట్రిక్ బ్లాకెట్‌ను తన వైజ్ఞానిక సలహాదారుగా చేసుకుని, భారతీయ రక్షణశాఖను బలోపేతం చేయగలిగారు. అనేక రంగాలలో ఆయన వేసిన పునాదులుమీదే దేశం తర్వాతికాలంలో పురోగతి సాధిస్తూ వస్తోంది కదా? ఇంత చేసినా దేశ నిర్మాతని చరిత్రపుటల్లోంచి తీసెయ్యాలని, ఉపన్యాసాలలో ఆయనపేరు రాకుండా విస్మరించడం ఏం గొప్పదనం? బాబూ రాజేంద్రప్రసాద్ తొలి రాష్ట్రపతిగా ఉన్నప్పుడు, నెహ్రూ కృషికి గుర్తింపుగా స్వయంగా ఆయనే 'భారత రత్న' ప్రకటించారు. ఆ విషయం దేశ ప్రజలకు కూడా తెలియజేశారు. ఆ విషయం పరిగణనలోకి తీసుకోకుండా నెహ్రూయే తనకు తాను భారతరత్న ప్రకటించుకున్నారని ఇప్పటి నీతిమాలిన పెద్దలు దుష్ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీలోని జవహర్‌లాల్‌నెహ్రూ యూనివర్సిటీ పేరు మార్చి నరేంద్ర మోదీ పేరుపెట్టాలని కుటిలయత్నాలు జరుగుతున్నాయట. విలువల వలువలు విడిచేసిన వారికి సిగ్గూ ఎగ్గూ ఏముంటుందీ?

తన తర్వాత తన భాష మాట్లాడేది నెహ్రూనే అని గాంధీజీ అన్నారు. సర్దార్‌పటేల్, నెహ్రూ కన్నా 14ఏళ్లు పెద్దవాడు. అయినా కూడా నెహ్రూకి తను జీవితకాలం విధేయుడినని ప్రకటించుకున్నారు. అలాగే రాజాజీ, సి.రాజగోపాలాచారి నెహ్రూ కన్నా 11ఏళ్లు పెద్ద. అయినా కూడా తనకన్నా నెహ్రూ 11వందల రెట్లు గొప్పవాడని రాజాజీ కితాబిచ్చారు. తొలిప్రధాని అయ్యాక, తన మంత్రివర్గంలో చేరి, హోంశాఖ నిర్వహించాల్సిందిగా నెహ్రూ పటేల్‌కు లేఖ రాశారు. దానికి ఆయన రాసిన ప్రత్యుత్తరం ఇలా ఉంది. ముప్పయ్యేళ్లుగా కొనసాగుతున్న మన స్నేహబంధం, స్వాతంత్రోద్యమంలో కార్యకర్తలుగా మన అనుబంధం చాలా గొప్పవి. వాటి ముందు ఈ ఆనవాయితీ అంగీకారాలు అవసరంలేదు. నా సేవలు మీరు ఎలా అంటే అలా ఉపయోగించుకోవచ్చు. ఈ దేశం కోసం మీరు చేసిన త్యాగం గొప్పది. ఇలాంటిది మీరుకాక, మరొకరెవరూ చేయలేదని నా విశ్వాసం. అందువల్ల, ఇక నాజీవితమంతా మీకు ఎదురుచెప్పని విశ్వాసపాత్రుడనై ఉంటూ అంకితభావంతో పనిచేస్తాను. "నేను కశ్మీరుకు చేయగలిగింది చేశాను. కశ్మీరుకు సంబంధించి విధానపరమైన అభిప్రాయ బేధాలు మీకూ నాకూలేవు. అయినా దురదృష్టవశాత్తూ మన కింద ఉన్నవారు మీకూ, నాకూ మధ్య పెద్ద అగాధాలు ఉన్నాయని భావిస్తున్నారు." (సర్దార్‌పటేల్ నెహ్రూకు రాసిన ఉత్తరం. అక్టోబరు 8, 1947)-నేషనల్ బుక్ ట్రస్ట్ (2010) పుస్తకం నుంచి) పండిట్‌నెహ్రూ నాటి దేశ రాజకీయాలనే కాదు, ప్రపంచ రాజకీయాలనే శాసించారు. దేశానికి దిశా నిర్దేశం చేస్తూ , దేశ ప్రజలకు వైజ్ఞానిక స్పృహ నూరిపోశారు. వాల్టర్ క్రూకర్ మాటల్లో "నెహ్రూ ఒక అరుదైన వ్యక్తి. సర్వస్వతంత్రుడై ఉండి, తెలివి, శక్తీ సామర్థ్యాలు ఉండి మంచివాడుగా, వినయశీలిగా ఉండడం అరుదు కదా" చదువూ, సంస్కారమూ లేక, వ్యక్తిత్వమూ లేక మందబలంతో బరితెగించిన నేతల్ని ఇప్పుడు మనం మన కళ్లముందు చూస్తున్నాం. ఈ మూర్ఖ ప్రభుత్వపు ఆగడాలు దేశాన్ని ఇంకా ఎంత అనాగరికతలోకి తీసుకువెళుతుందో తెలియదు.

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త

టికెట్‌లేని ప్రయాణికులకు రూ.2,200 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: టికెట్‌లేని ప్రయాణికుల నుంచి రైల్వేశాఖ రూ.2,200 కోట్లు జరిమానాగా వసూలు చేసింది. 2022-23లో మొత్తం 3.6 కోట్లమంది టికెట్ లేకుండా లేదా నకిలీ టికెట్లతో ప్రయాణించినట్లు ఆర్‌టీఐ ద్వారా తెలిసింది. గతేడాదితో పోలిస్తే ఈ సంఖ్య కోటికి పైగానే ఉన్నట్లు వెల్లడించింది. 2019-20లో 1.10 కోట్లమందిని పట్టుకోగా 2021-22లో ఈ సంఖ్య 2.7 కోట్లకు చేరింది. 2022-23లో 3.6 కోట్లమంది టికెట్ లేకుండా ప్రయాణించారు. 2020-21లో కోవిడ్ కారణంగా కేవలం 32.56 లక్షల మంది మాత్రమే టికెట్ లేకుండా ప్రయాణించినట్లు ఆర్‌టీఐ వివరించింది. మధ్యప్రదేశ్‌కు చెందిన సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ సమాచార హక్కు చట్టం కింద అడిగిన ప్రశ్నకు...గడచిన మూడేళ్లకుగాను టికెట్‌లేని ప్రయాణికుల వల్ల లభించిన ఆదాయాన్ని రైల్వే తెలిపింది. 2022-23లో టికెట్ లేని ప్రయాణికుల సంఖ్య చిన్న దేశాల జనాభా కన్నా ఎక్కువగా ఉంది. టికెట్ లేని ప్రయాణికుడి నుంచి అసలు టికెట్ ధరకు అదనంగా కనీసం రూ.250 జరిమానా విధించారు. జరిమానా చెల్లించడానికి ఇష్టపడని వారు...చెల్లించడానికి డబ్బులు లేని వారిని ఆర్‌పీఎఫ్‌కి అప్పగించడం, రైల్వేచట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచగా కొంతమందికి రూ.1000 జరిమానా విధించే వారు. అప్పటికీ కొంతమంది జరిమానా చెల్లించడానికి ఇష్టపడకపోతే వారికి ఆరు మాసాల జైలు శిక్ష విధించేవారు.

ఉద్యోగం నుంచి బీజేపీ నేత భార్య తొలగింపు

మంగళూరు: కర్నాటకలో ప్రభుత్వం మారడంతో హత్యకు గురైన బీజేపీ యువమోర్చా నాయకుడు ప్రవీణ్ నెట్టారు భార్య నూతన కుమారి ఉద్యోగం కోల్పోయారు. ప్రవీణ్ నెట్టారు మృతితో ఆయన భార్యకు మంగళూరులోని డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఉద్యోగం లభించింది. విధుల నుంచి నూతన కుమారిని తప్పిస్తూ ఆదేశాలు వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపాయి. గతేడాది ప్రవీణ్ నెట్టారు హత్య తర్వాత బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, దక్షిణ కన్నడ ఎంపీ నళిన్ కుమార్ కతీల్ అభ్యర్థన మేరకు నూతన కుమారికి కాంట్రాక్టు పద్ధతిలో నాటి బీజేపీ ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చింది. నాటి సీఎం బసవరాజ్ బొమ్మై కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్(గ్రూప్ సీ)గా నియమిస్తూ 2022 సెప్టెంబరు 22న బీజేపీ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ తర్వాత నూతన కుమారి అభ్యర్థన మేరకు దక్షిణ కన్నడ డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి బదిలీ చేశారు. గతేడాది అక్టోబరు 14న ఆమె ఉద్యోగంలో చేరారు. ప్రస్తుత ముఖ్యమంత్రి పదవిలో ఉన్నంత వరకూ లేదా తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు నూతన కుమారి ఉద్యోగంలో ఉండవచ్చని నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.2వేలు నోట్లు తీసుకోని బంకు సిబ్బందిపై కేసు

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం తీసుకునే ఆకస్మిక నిర్ణయాలు దేశ ప్రజల కష్టాలను మరింత పెంచేవిగా పరిణమిస్తుంటాయి. తాజాగా రూ.2వేల నోట్ల ఉపసంహరణను కేంద్రం ప్రకటించింది. దీంతో రూ.2వేల చెలామణి ప్రజలకు తలనొప్పిగా మారింది. తాజాగా దేశ రాజధానిలోని ఓ పెట్రోల్ బంకులో రూ.2వేల నోటు తీసుకోలేదని, అక్కడి సిబ్బందిపై వినియోగదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కోట్లా పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైనట్లు సీనియర్ పోలీసు అధికారి శనివారం తెలిపారు. స్కూటర్‌లో రూ.400 పెట్రోల్ నింపుకున్న వ్యక్తి రూ.2వేల నోటు ఇవ్వగా సౌత్ ఎక్స్‌టెన్షన్-1లోని పెట్రోల్ బంకు సిబ్బంది దానిని తీసుకునేందుకు నిరాకరించినట్లు ఫిర్యాది పేర్కొన్నట్లు వెల్లడించారు. ఈ వ్యవహారాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. సెప్టెంబరు 30 వరకు రూ.2వేల నోట్లను బ్యాంకుల్లో జమచేయడం లేక మార్చుకోవడమో చేయాలని భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) సూచించిన విషయం విదితమే.

పార్లమెంటు కొత్త భవనం అవసరమే లేదు
మోదీ సర్కారుపై నితీశ్‌కుమార్ ఆగ్రహం



పాట్నా: నూతన పార్లమెంటు భవనం ప్రారంభోత్సవాన్ని ప్రతిపక్షాలు బహిష్కరించిన వేళ...దీనిపై బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో పార్లమెంటు కోసం కొత్త భవనం నిర్మానం చేయాల్సిన అవసరమే లేదని నితీశ్ స్పష్టం చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఎలాంటి పాత్రలేని వారి ద్వారా కొత్త చరిత్ర సృష్టించే ప్రయత్నమే నూతన పార్లమెంటు భవన నిర్మాణమని నితీశ్ శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో నిందించారు. పార్లమెంటు భవనం ప్రారంభోత్సవానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్కర్‌ను ఆహ్వానించకపోవడంపై నితీశ్ అసంతృప్తి వెలిబుచ్చారు. పార్లమెంటు భవన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు జేడీయూ ఇప్పటికే ప్రకటించింది. ఈ భవనాన్ని ప్రధాని నరేంద్రమోదీ ప్రారంభించడాన్ని నిరసిస్తూ రోజంతా నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించింది. 'కొత్త పార్లమెంటు భవనం అవసరం ఇప్పుడేమీ లేదు. దేశానికి స్వాతంత్ర్యం కోసం జరిగిన పోరాటంలో ఎలాంటి పాత్ర లేని వారు చరిత్రను వక్రీకరించడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం ఆశ్చర్యంగా ఉంది' అని నితీశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. 'భారతదేశ పార్లమెంటరీ వ్యవస్థలో రాష్ట్రపతికి ముఖ్యమైన భాగస్వామ్యం ఉందని జేడీయూ బలంగా విశ్వసిస్తోంది. రాష్ట్రపతిగా ద్రౌపది ముర్ము దేశంలో అత్యున్నతస్థాయి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్నారు. కొత్త భవనం ప్రారంభోత్సవానికి ఆమెను ప్రధాని నరేంద్రమోదీ ఆహ్వానించాలి' అని జేడీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఉమేశ్ సింగ్ కుశ్వాహా శనివారం ఇక్కడ విలేకరుల సమావేశంలో చెప్పారు. నీతి ఆయోగ్ సమావేశానికి గైర్హాజరు కావడంపై ప్రశ్నించగా 'ఆ సమావేశం ఉదయం ఏర్పాటు చేశారు. అదేరోజు పాట్నాలో నాకు ముందుగా ఏర్పాటు చేసుకున్న కార్యక్రమాలు ఉన్నాయి. అందువల్ల నేను దిల్లీకి వెళ్లడం లేదు. ఒకవేళ సాయంత్రం వేళ నీతిఆయోగ్ సమావేశం ఏర్పాటు చేసినట్లయితే కచ్చితంగా వెళ్లేవాడిని. ఆ సమావేశానికి హాజరవుతున్న మంత్రులు, అధికారుల జాబితాను నేను పంపాను. అయితే, మోదీ సర్కారు నుంచి సమాధానం రాలేదు. అందుకే బీహార్ నుంచి ఎవరూ హాజరు కాలేదు' అని నితీశ్‌కుమార్ వివరించారు. రూ.2 వేల నోట్లను వెనక్కి తీసుకోవాలన్న ఆర్‌బీఐ నిర్ణయంపై ప్రశ్నించగా ముందుగా రూ.1000 నోట్లు రద్దు చేశారు. ఇప్పుడు రూ.2 వేల నోట్లు...వారి ఉద్దేశాలు, లక్ష్యాలు ఏమిటో నాకు అర్థం కావడం లేదు' అని నితీశ్ చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రతిపక్షాల ఐక్యత కోసం చర్చించడానికి బీజేపీ యేతర పార్టీలు ఇక్కడ సమావేశమవుతున్నాయా అని అడుగగా దీని గురించి తర్వాత మాట్లాడదామని ఆయన చెప్పారు.

అవినీతికి కేరళ దూరం: విజయన్

కొచ్చి: దేశంలో అతి తక్కువ అవినీతి రాష్ట్రంగా కేరళ నిలిచిందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ చెప్పారు. అయితే, కాలానుగుణంగా మార్పు చెందని కొంతమంది అవినీతిపరులు ఇంకా సర్వీసులో ఉన్నారని విజయన్ అన్నారు. కేరళ పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర మహాసభను శనివారం విజయన్ ప్రారంభించారు. అవినీతిలో భాగస్వాములకు శిక్ష తప్పదని విజయన్ హెచ్చరించారు. దేశంలో అతితక్కువ అవినీతి రాష్ట్రంగా కేరళ నిలవడం గర్వంగా ఉంది. అయితే, మన ప్రభుత్వం పూర్తిగా అవినీతి రహితంగా ఉందని మనం చెప్పలేం. ఎందుకంటే...సర్వీసులో ఉన్న కొంతమంది ఇంకా కాలానుగుణంగా మార్పు చెందలేదు. ఆ కుళ్లు ఇంకా అక్కడక్కడా కనిపిస్తోంది. అన్ని శాఖల్లోనూ అలాంటి వారు ఉన్నారు. అవినీతిపరులను సహించేది మాత్రం లేదు' అని విజయన్ హెచ్చరించారు. అవినీతిపరులు అక్రమమార్గాల కోసం అన్వేషిస్తారని, వారందరినీ చట్టం ముందు నిలబెడతామని స్పష్టంచేశారు. అవినీతిపరులను అధికారులు వ్యతిరేకించాలని, పై అధికారులకు సమాచారం ఇవ్వాలని, అది ఉద్యోగుల కనీస బాధ్యతని సీఎం విజయన్ హితబోధ చేశారు. రాష్ట్రంలోని పోలీసుశాఖను ఆయన ప్రశంసించారు. మతోన్మాదశక్తులు విధ్వంసానికి ప్రయత్నించినప్పటికీ రాష్ట్రంలో శాంతి, సామరస్యత కోసం పోలీసులు శ్రమిస్తున్నారని చెప్పారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే కేరళ శాంతియుత రాష్ట్రమని వ్యాఖ్యానించారు. చాలా ప్రాంతాలు మత హింసకు గురైనప్పటికీ ఇక్కడ మాత్రం అలాంటి పరిస్థితి లేదని తెలిపారు. దీనికి కారణం ఇక్కడ బలమైన లౌకిక సమాజం ఉందని పేర్కొన్నారు. అదేసమయంలో రాష్ట్రంలో మతోన్మాదశక్తుల కుట్రలను అడ్డుకోవడంలో పోలీసుల పాత్ర ప్రధానమన్నారు. సంఘవ్యతిరేక శక్తులు ఎంత రెచ్చగొట్టినా పోలీసులు సంయమనంతో వ్యవహరిస్తున్నారని కితాబిచ్చారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో మన సైబర్ బృందాలు అద్భుతంగా పనిచేస్తున్నాయని కొనియాడారు.

అలరించే అలంకరణతో పార్లమెంట్

మీర్జాపూర్ తివాచీలు... నాగపూర్ టేక్‌వుడ్
అద్భుత సొబగులతో కొత్త భవనం కళకళ

న్యూఢిల్లీ : దేశ ప్రజాస్వామ్య దేవాలయ కొత్త భవనం అలరించే అలంకరణతో శోభిల్లుతోంది. దేశ చట్టాలు, సంగతులు... ప్రభుత్వ విధివిధానాలు... ప్రజా సమస్యలపై చర్చలు, వాదనలు, అరుపులు, కేకలతో సాగే పార్లమెంటు సమావేశాలు జరుగుతాయి. అయితే ఇప్పుడు నూతన సొబగులు ప్రజాప్రతినిధులనే కాకుండా ఆ సమావేశాలను వీక్షించే ప్రజలకు కొత్త అనుభూతిని పంచనున్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని మీర్జాపూర్ నుంచి తివాచీలు, త్రిపుర నుంచి వెదురు ఫ్లోరింగ్, రాజస్థాన్ నుంచి రాతి శిల్పాలతో ఈ ప్రజాస్వామ్య వేదిక అలంకృతమైంది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించబోతున్న కొత్త పార్లమెంటు భవనం భారతదేశ విభిన్న సంస్కృతిని ప్రతిబింబిస్తోంది. భవనంలో ఉపయోగించిన టేకువుడ్ మహారాష్ట్రలోని నాగ్‌పూర్ నుంచి తీసుకోగా, ఎరుపు, తెలుపు ఇసుకరాయిని రాజస్థాన్‌లోని సర్మతుర నుంచి సేకరించారు. జాతీయ రాజధానిలోని ఎర్రకోట, హుమాయూన్ సమాధి కోసం ఇసుకరాయి కూడా సర్మతుర నుండి సేకరించినట్లు తెలిసింది. అలాగే, ఉదయపూర్ నుంచి కేశారియా గ్రీన్ స్టోన్, అజ్మీర్ సమీపంలోని లఖా నుంచి రెడ్ గ్రానైట్, వైట్ మార్బుల్ రాజస్థాన్‌లోని అంబాజీ నుంచి సేకరించారు. 'ఒక విధంగా, ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడానికి దేశం మొత్తం కలిసి వచ్చింది. తద్వారా ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ నిజమైన స్ఫూర్తిని ప్రతిబింబిస్తుంది' అని ఒక అధికారి తెలిపారు. లోక్‌సభ, రాజ్యసభ ఛాంబర్‌లలో ఫాల్స్ సీలింగ్‌ల కోసం స్టీల్ నిర్మాణం కేంద్రపాలిత ప్రాంతం డామన్, దయ్యూ నుంచి తీసుకున్నారు. కొత్త భవనంలోని ఫర్నిచర్ ముంబైలో రూపొందించారు. రాజస్థాన్‌లోని రాజ్‌నగర్, ఉత్తరప్రదేశ్‌లోని నోయిడా నుంచి ఈ భవనాన్ని చుట్టుముట్టే రాతి 'జాలీ' (జాలక) పనులు తీసుకున్నారు. అశోక చిహ్నం కోసం సామాగ్రిని మహారాష్ట్రలోని ఔరంగాబాద్, రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి సేకరించారు. అయితే లోక్‌సభ, రాజ్యసభ గదులు, పార్లమెంటు భవనం వెలుపలి భాగాలను ధరించే అశోక్ చక్రాన్ని మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి సేకరించారు.

రాతి చెక్కడం పనిని అబు రోడ్, ఉదయపూర్ శిల్పులు చేశారు. రాజస్థాన్‌లోని కొట్‌పుతాలి నుంచి రాతి కంకరలను సేకరించారు. కొత్త పార్లమెంటు భవనం నిర్మాణ కార్యకలాపాల కోసం కాంక్రీట్ మిశ్రమాన్ని రూపొందించడానికి హరియాణాలోని చర్కి దాద్రీ నుంచి తయారు చేయబడిన ఇసుక లేదా ఎం-ఇసుక (తయారు చేసిన) ను ఉపయోగించారు. ఎం-ఇసుక పర్యావరణ అనుకూలమైనదిగా పరిగణిస్తారు. ఎందుకంటే ఇది పెద్ద గట్టి రాళ్లను లేదా గ్రానైట్‌ను చితకకొట్టడం ద్వారా తయారవతుంది. నిర్మాణంలో ఉపయోగించిన ఫ్లై యాష్ ఇటుకలు హరియాణా, ఉత్తరప్రదేశ్ నుంచి తీసుకోగా, ఇత్తడి పనులు, ప్రీ-కాస్ట్ ట్రెంచ్‌లు గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి వచ్చాయి.

కేరళ వైద్య కళాశాలలో అరుదైన శస్త్రచికిత్స

తిరువనంతపురం: కేరళలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో అద్భుతం జరిగింది. వెన్నెముక కండరాల బలహీనతతో బాధపడుతున్న 14 ఏళ్ల బాలికకు ఆసుపత్రి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఈ వ్యాధిని స్పైనల్ మస్కులర్ అట్రోఫీ(ఎస్ఎంఏ) అని పిలుస్తారు. ఈ వ్యాధి జన్యుపరంగా సంభవిస్తుంటుంది. ఎస్ఎంఏ రోగికి బలహీనపడిన వెన్నెముక కండరాలను సరిచేయడం కోసం వైద్యులు వినూత్న పద్ధతి అనుసరించారు. తిరువనంతపురంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఈ సర్జరీ జరిగింది. ప్రభుత్వరంగంలో ఇలాంటి శస్త్రచికిత్స జరగడం ఇదే ప్రథమం. ఆర్థోపెడిక్ శాఖ పర్యవేక్షణలో గురువారం ఈ ఆపరేషన్ జరిగినట్లు ఆరోగ్యశాఖ శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. కోజికోడ్‌కు చెందిన ఎస్ఎంఏ రోగి , 14 ఏళ్ల బాలికకు సర్జరీ చేశారు. అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఆ బాలిక 11 ఏళ్లుగా వీల్‌చైర్‌కే పరిమితమైంది. దాదాపు 8 గంటల పాటు సుదీర్ఘంగా సర్జరీ జరిగిందని, ఇది సంక్లిష్టమైనదైనా విజయవంతమైందని వైద్యులు చెప్పారు. ఆపరేషన్‌ను విజయవంతం చేసిన వైద్యులను ఆరోగ్యశాఖమంత్రి వీణా జార్జి అభినందించారు. ఆ బాలిక ఆసుపత్రిలో వేగంగా కోలుకుంటున్నది. ఈ ఆపరేషన్‌కు ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.15 లక్షల ఖర్చవుతుంది. ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉచితంగా ఆపరేషన్ చేశారు.

స్పైనల్ మస్కులర్ అట్రోఫి ఒక అరుదైన వ్యాధి. ఇది చిన్నారులకు సోకుతుంది. దీనివల్ల కండరాలు బలహీనపడతాయి. ఎస్ఎంఏ వల్ల పిల్లల మెదడులో ఉండే కణాలు, వెన్నెముకలోని సిరలు క్రమంగా బలహీనపడతాయి. ఫలితంగా వారి మెదడు, కండరాల కదలికలను నియంత్రించే సంకేతాలను పంపటం ఆపేస్తుంది. సమయం గడిచే కొద్దీ వ్యాధి తీవ్రత పెరుగుతూ ఉంటుంది. దీనికి చికిత్స పద్ధతులు చాలా పరిమితంగా ఉన్నాయి. ఎస్ఎంఏ వ్యాధి నాలుగు రకాలుగా ఉంటుంది. ఎస్ఎంఏ రకాన్ని బట్టి లక్షణాలు మారుతుంటాయి. సాధారణ వ్యాధి లక్షణాల్లో చేతులు, పాదాలు బలహీనంగా మారడం, కూర్చోవడం, నడవడం, ఇతర శారీరక కదలికల్లో ఇబ్బంది, కండరాలను కదిలించలేకపోవడం, ఎముకలు, కీళ్లు, వెన్నెముకలో నొప్పులు, ఆహారం మింగడంలో ఇబ్బంది, శ్వాస తీసుకోవడం కష్టంగా మారడం వంటి సమస్యలు కనిపిస్తాయి.

ఖీర్ భవాని ఆలయంలో
సౌకర్యాల లేమిపై భక్తుల నిరసన

శ్రీనగర్ : వార్షిక ఖీర్ భవానీ మేళాలో యాత్రికులకు తగిన సౌకర్యాలు లేవని ఆరోపిస్తూ కశ్మీర్ పండిట్ భక్తులు శనివారం గందర్‌బల్ జిల్లాలో నిరసన చేపట్టారు. ఆదివారం జరిగే వార్షిక జాతర కోసం సెంట్రల్ కశ్మీర్ జిల్లాలోని తుల్ముల్లా ప్రాంతంలోని రగ్న్యా దేవి ఆలయానికి చేరుకున్న భక్తుల బృందం తగిన సౌకర్యాలు లేకపోవడం కారణంగా చాలా సమస్యలను ఎదుర్కొన్నట్లు ఆరోపించారు. మహిళలు, చిన్నారులు సహా భక్తులు నిర్వాహకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'నిన్నటి నుంచి ఇక్కడే ఉంటున్నాం. చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాం. యాత్రికులకు తాగునీరు, వసతి తదితర సౌకర్యాలు లేవు' అని నిరసన వ్యక్తం చేస్తున్న భక్తుడు పేర్కొన్నారు. 'మేము ఇక్కడికి వస్తున్నామని అధికారులకు తెలుసు. వారు మాకు సరైన ఏర్పాట్లు చేసి ఉండాలి' అని ఆమె అన్నారు. వారు చాలా నిరుత్సాహానికి గురయ్యారని, వారు గత రాత్రి మాత్రమే బయలుదేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఆలయ పూజా మందిరంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని అధికారులు వారికి హామీ ఇచ్చారని, అయితే అలాంటి ఏర్పాట్లు లేవని మరో నిరసనకారుడు అన్నారు. 'నిన్న డిప్యూటీ కమిషనర్ కూడా ఎవరూ ఇక్కడకు రాలేదు. వారు కేవలం కశ్మీర్ పండిట్ల పేరుతో డబ్బు సంపాదిస్తున్నారు' అని ఆయన అన్నారు. రాత్రంతా బయటే కింద కూర్చోవాల్సి వచ్చిందని ఆందోళనకారులు ఆరోపించారు. 'యాత్రికులకు సరిపడా సౌకర్యాలు లేవు. తాగునీరు లేదు, మరుగుదొడ్లలో నీరు లేదు. ఇక్కడ సౌకర్యాలు లేవు' అని మరొక భక్తుడు చెప్పాడు. అయితే, కొందరు సంఘ వ్యతిరేక వ్యక్తులు తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని డిప్యూటీ కమిషనర్ గందర్‌బల్ శ్యాంబీర్ తెలిపారు. 'మాకు ఇక్కడ తగినంత వసతి సౌకర్యాలు ఉన్నాయి. అయినప్పటికీ, నిరసన ఉంది. ఇక్కడ 2,400 మంది యాత్రికులు ఉన్నారని, కేవలం 12 మంది మాత్రమే నిరసన తెలిపారని మనం అర్థం చేసుకోవాలి' అని డిప్యూటీ కమిషనర్ అన్నారు.

నెహ్రూ వారసత్వం దీపస్తంభం

దేశ ప్రథమ ప్రధానికి రాహుల్‌తో సహా కాంగ్రెస్ ఘన నివాళి

న్యూఢిల్లీ : జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ మాజీ అధినేత రాహుల్ గాంధీతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు నెహ్రూకు ఘనంగా నివాళులు అర్పించారు. భారతదేశం ఆలోచనను, స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలను ప్రకాశింపజేస్తూ, దేశ మొదటి ప్రధాన మంత్రి వారసత్వం ఒక దీపస్తంభంలా నిలుస్తుందని రాహుల్ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ ఇక్కడి శాంతి వనంలో నెహ్రూ స్మారకాన్ని సందర్శించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్మారక చిహ్నం వద్ద ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు కె.సి.వేణుగోపాల్, పవన్ బన్సాల్ తదితరులు పాల్గొన్నారు. అనేక మంది పార్టీ నాయకులు సామాజిక మాధ్యమాల్లో కాంగ్రెస్ నేతకు నివాళులు అర్పించారు. 1889లో జన్మించిన నెహ్రూ భారతదేశానికి ఎక్కువ కాలం... ఆగస్టు 1947-మే 1964 మధ్య ప్రధాన మంత్రిగా ఉన్నారు. నెహ్రూ మే 27, 1964 న మరణించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సహకారం లేకుండా 21వ శతాబ్దపు భారతదేశాన్ని ఊహించలేమని ఖర్గే హిందీలో ట్వీట్ చేశారు. సవాళ్లు ఉన్నప్పటికీ ప్రజాస్వామ్య నిర్భయ రక్షకుడు, ఆయన ప్రగతిశీల ఆలోచనలు, భారతదేశం సామాజిక, రాజకీయ, ఆర్థిక అభివృద్ధిని బలంగా నడిపించాయని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. 'హింద్ కే జవహర్' కి నా వినయపూర్వకమైన నివాళులు' అని అన్నారు. మాజీ ప్రధానికి నివాళులు అర్పిస్తూ, రాహుల్ గాంధీ ఒక ట్వీట్‌లో, నెహ్రూ వారసత్వం ఒక దీపస్తంభంలా నిలుస్తుంది. భారతదేశం ఆలోచనను, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, ఆధునికత కోసం ఆయన తన జీవితాన్ని అంకితం చేసిన విలువలను ప్రకాశవంతం చేస్తుంది. ఆయన దృష్టి, విలువలు ఎల్లప్పుడూ మన మనస్సాక్షికి, చర్యలకు మార్గనిర్దేశం చేస్తాయి' అని పేర్కొన్నారు. నెహ్రూపై దృశ్య, శ్రవణ చిత్రాలను ట్యాగ్ చేశారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వాద్రా జవహర్ లాల్ నెహ్రూకు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నెహ్రూపై దృశ్య, శ్రవణ చిత్రాలను ట్విట్టర్‌లో పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ తన అధికార ట్విట్టర్ ఖాతా నుంచి నెహ్రూకు నివాళి అర్పించారు. 'మన మొదటి ప్రధాన మంత్రి, 'ఆధునిక భారతదేశ రూపశిల్పి' వర్ధంతి సందర్భంగా మేము పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ గుర్తుంచుకున్నాము. అనేక ఆర్థిక విధానాలు, పారిశ్రామిక స్థాపనల ద్వారా దేశాన్ని ఉన్నత శిఖరాలకు నడిపించిన దూరదృష్టి గల వ్యక్తి ఆయన' అని పార్టీ పేర్కొంది. ఐఐటీలు, ఐఐఎంలు, ఏఐఐఎంఎస్‌లు, డీఆర్‌డీవో సహా 'ఆధునిక భారతదేశ దేవాలయాలు' నుంచి భారతదేశం అణు, అంతరిక్ష పరిశోధనలలో భారతదేశం పారిశ్రామిక అద్భుతాలు, భారతదేశం పరాక్రమం అపూర్వమైన పరిమాణానికి విస్తరించింది. భారతదేశాన్ని ప్రపంచ స్థాయికి అగ్రగామిగా, ప్రపంచ శక్తిగా తీసుకొచ్చిన పండిట్ జీ వారసత్వాన్ని ఈ రోజు మనం ఎంతో గౌరవిస్తాం' అని వివరించింది.

సుస్థిర ప్రభుత్వాలతో అన్నీ సాధ్యమే
ప్రధాని మోదీ వ్యాఖ్య

న్యూఢిల్లీ: ప్రజలు సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకున్న కారణంగానే కీలక హామీలన్నీ అమలు చేయగలుగుతున్నామని ప్రధాని నరేంద్రమోదీ చెప్పారు. ప్రధానిగా బాధ్యతలు చేపట్టి శుక్రవారానికి 9 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పనితీరును ప్రశంసిస్తూ నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో పెట్టిన పోస్టులకు సమాధానంగా మోదీ స్పందించారు. '9 ఏళ్ల మోదీ ప్రభుత్వంపై అనేక ట్వీట్లను ఉదయం నుంచి చూస్తున్నాను. 2014 నుంచి తమ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, కార్యక్రమాలను అభినందిస్తూ ప్రజలు పోస్టులు పెడుతున్నారు. అలాంటి ప్రేమను స్వీకరించడం గౌరవంగా ఉంటుంది. ప్రజల కోసం కష్టపడి పనిచేయడానికి ఇది నాకు మరింత బలాన్ని చేకూరుస్తుంది' అని మోదీ శనివారం ట్వీట్ చేశారు. తన ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ ఓ నెటిజన్ చేసిన ట్వీట్‌కు స్పందిస్తూ...'గడచిన 9 ఏళ్లుగా దేశంలోని అన్ని ప్రాంతాలు చుట్టి వచ్చాను. అన్ని హామీలు అమలు చేశాను. రానున్న కాలంలో మరింత చేస్తాను. అంతిమంగా అమృతకాలంలో పటిష్ఠ, సుసంపన్న భారత్‌ను నిర్మిస్తాను' అని మోదీ పేర్కొన్నారు. దేశ ప్రజలు సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ఏమి చేయడానికైనా అవకాశం ఉంటుందని చెప్పారు. సుస్థిర ప్రభుత్వం ఉంటేనే కీలక హామీలు అమలు చేయడం సాధ్యమవుతుందన్నారు. ఇలాంటి మద్దతు తమకు గొప్ప బలాన్ని ఇస్తుందని వ్యాఖ్యానించారు. ప్రజల జీవన ప్రమాణం మెరుగుదలకు, భారత అభివృద్ధి పథాన్ని వేగవంతం చేయడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని మోదీ పేర్కొన్నారు. మౌలిక సదుపాయ రంగంపై ప్రభుత్వం తీసుకుంటున్న చొరవను ప్రశంసిస్తూ వచ్చిన ట్వీట్‌కు స్పందిస్తూ...మీరు అత్యంత కీలక మౌలిక సదుపాయాలను, సులభతర జీవిత ప్రాజెక్టులను ప్రస్తావించారని, ఈ సదుపాయాలు క్షేత్రస్థాయిలోను మంచి ప్రభావం చూపాయని మోదీ తెలిపారు. 140 కోట్ల భారతీయుల ఆకాంక్షలు పరిపూర్తి చేసే అవకాశం తనకు లభించినందుకు గర్వంగా ఉందని చెప్పారు.

నీతి, నైతికత బోధించే సంస్థ కోర్టు కాదు
సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : న్యాయస్థానం నీతి, నైతికతపై సమాజానికి ప్రబోధించే సంస్థ కాదని, నిర్ణయాలు తీసుకునేటప్పుడు అది చట్ట నియమానికి కట్టుబడి ఉంటుందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇద్దరు పిల్లల హత్య కేసులో దోషిగా తేలిన మహిళను ముందస్తుగా విడుదల చేయాలని ఆదేశించిన సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ఆ మహిళకు ఓ వ్యక్తితో అక్రమ సంబంధం ఏర్పడింది. అతను తరచూ బెదిరించేవాడు. దీంతో ఆమె తన పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుంది. మొక్కలకు కావాల్సిన పురుగుమందులు కొని తన ఇద్దరు పిల్లలకు విషం కలిపింది. ఆ తర్వాత, పురుగుమందును తాను తాగేందుకు గ్లాసులో పోసుకున్నప్పుడు, ఆమె మేనకోడలు దానిని కిందకు నెట్టింది. దురదృష్టవశాత్తు, ఇద్దరు పిల్లలు ఆసుపత్రికి చేరుకోగానే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. భారతీయ శిక్షాస్మృతిలోని సెక్షన్ 302 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ట్రయల్ కోర్టు మహిళను ఐపీసీ సెక్షన్లు 302 (హత్య), 309 (ఆత్మహత్య) కింద దోషిగా నిర్ధారించింది. జరిమానాతో పాటు జీవిత ఖైదు విధించింది. అయితే హైకోర్టు ఐపీసీ సెక్షన్ 302 కింద నేరారోపణను సమర్థిస్తూనే సెక్షన్ 309 కింద ఆమెను నిర్దోషిగా ప్రకటిస్తూ ఆమె పిటిషన్‌ను పాక్షికంగా అనుమతించింది. దాదాపు 20 ఏళ్లుగా తాను జైలులో ఉన్నానని, ముందస్తుగా విడుదల చేయాలని మహిళ వేడుకుంది. అయితే, ఆమె చేసిన నేరం క్రూరమైన స్వభావాన్ని పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర స్థాయి కమిటీ సిఫార్సును తమిళనాడు ప్రభుత్వం తిరస్కరించింది. తన అక్రమ సంబంధాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో మహిళ తన కుమారులను హత్య చేసేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదని న్యాయమూర్తులు అజయ్ రస్తోగి, అహ్సానుద్దీన్ అమానుల్లాతో కూడిన సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది. దానికి విరుద్ధంగా, ఆమె తన పిల్లలతో కలిసి ఆత్మహత్యకు ప్రయత్నించింది. ఆమె తన అక్రమ సంబంధాన్ని కొనసాగించాలనే ఉద్దేశంతో కాకుండా, తనతో అక్రమ సంబంధం కలిగిన వ్యక్తి చేసిన గొడవపై నిరాశతో ఆత్మహత్యకు ప్రయత్నించిందని కోర్టు తెలిపింది. 'ఈ కోర్టు నీతి, నైతికత గురించి సమాజానికి ప్రబోధించే సంస్థ కాదు. దీని గురించి మేము ఇకపై చెప్పలేము. నిర్ణయాలు తీసుకునేటప్పుడు అది చట్ట నియమానికి కట్టుబడి ఉంటాము' అని పేర్కొంది. ఈ కేసును కేవలం 'క్రూరమైన' నేరంగా పరిగణించలేమని, ఎందుకంటే మహిళ స్వయంగా తన జీవితాన్ని అంతం చేసుకోవడానికి

ప్రయత్నించిందని, అయితే ఆ సమయంలో ఆమె మేనకోడలు అడ్డుకుంది' అని న్యాయస్థానం తెలిపింది. అంతేకాకుండా, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్/ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ అందించిన రాష్ట్ర స్థాయి కమిటీ సిఫార్సులో ఆమె వివాదరహిత ప్రవర్తనతో పాటు ఇప్పటికే ఖైదు చేయబడిన సుదీర్ఘ కాలం కూడా ఉంది' అని ధర్మాసనం పేర్కొంది. మహిళను ముందస్తుగా విడుదల చేసేందుకు రాష్ట్ర స్థాయి కమిటీ చేసిన సిఫార్సును అంగీకరించకపోవడానికి సరైన కారణం లేదా సమర్థనీయమైన కారణం లేదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. 'మేము నేరం పట్ల నిర్లక్ష్యంగా లేము. అయితే అప్పీలుదారు (తల్లి) విధి క్రూరమైన చేతుల్లో ఇప్పటికే బాధపడిందనే వాస్తవాన్ని కూడా మరచిపోము. ఈ కోర్టు ప్రవేశించకుండా ఉండడానికి దానికి కారణం' అని వ్యాఖ్యానించింది. 'ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సంతకంతో హోం (జైలు-4) శాఖ జారీ చేసిన జీవో ప్రకారం అప్పీలుదారు ముందస్తు విడుదల ప్రయోజనం పొందేందుకు అర్హులు. దీని ప్రకారం, మరే ఇతర కేసులో అవసరం లేకుంటే, అప్పీలుదారుని వెంటనే విడుదల చేయాలని ఆదేశించబడింది' అని ధర్మాసనం పేర్కొంది.

కార్మిక హక్కుల పరిరక్షణకు పోరు

- కడప బహిరంగ సభలో ఓబులేసు పిలుపు
- ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనాలు ప్రారంభం

విశాలాంధ్ర-కడప బ్యూరో: దేశంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న మోదీ, జగన్ ఇద్దరూ కార్మిక వ్యతిరేక శక్తులనీ, కార్పొరేట్ అనుకూల మిత్రులని వీరిద్దరిని గద్దెదించాల్సిన బాధ్యత కార్మిక వర్గంపై ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు నొక్కిచెప్పారు. ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సమ్మేళనాల ప్రారంభం సందర్భంగా శనివారం కడప నగరంలో కార్మిక ర్యాలీ అనంతరం మున్సిపల్ ఉర్దూ స్కూల్లో కడప జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ అధ్యక్షతన బహిరంగ సభ నిర్వహించారు. ఓబులేసు మాట్లాడుతూ నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనలో కార్మిక వర్గం అనేక అవస్థలు పడుతున్నారని, ఈ దేశ ఆర్థిక సంపదకు మూలకాంణమైన కార్మికులపై కక్ష సాధింపు ధోరణి అవలంబిస్తున్నారని చెప్పారు. కార్పొరేట్ అనుకూల శక్తిగా మారి, దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ఆదాని, అంబానీలకు ధారధత్తం చేస్తూ బ్రిటిష్ నాటి కాలంలో పోరాడి సాధించుకున్న చట్టాలను, హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. అనేక కార్మిక పోరాటాల ఫలితంగా సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్మికులకు రక్షణ లేకుండా చేశారరన్నారు. కనీస వేతనాలు అమలు చేయడం లేదని ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న కార్మికులను ఉద్యోగులుగా గుర్తించకుండా వేతనాలు పెంచకుండా ప్రచార అర్భటాలకు మోదీ ప్రభుత్వం పరిమితమైంద న్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి తూట్లు పొడుస్తూ కనీసం కార్మికుల సమస్యలు తెలుసుకోకుండా రాజకీయ కుమ్ములాటలతో ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడానికి రాష్ట్ర రాజకీయం సరిపోయిందన్నారు. కార్మిక చట్టాల పరిరక్షణకు రాబోయే రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, డిప్యూటీ కార్యదర్శి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పరిపాలనతో కార్మిక వర్గం కుదేలవుతుందని పాదయాత్రలో ఇచ్చిన ఏ ఒక్క హామీలను అమలు చేయకుండా వేతనాలు పెంచకుండా, ఉద్యోగ భద్రత కల్పించకుండా, సీపీఎస్ రద్దు చేయకుండా పోరాటం చేస్తే అరెస్టులు నిర్భంధాలు చేయడం ఈ ప్రభుత్వానికి అలవాటుగా మారిందన్నారు. మహిళలు అని చూడకుండా కనీస వేతనాలు అడిగితే నిర్భందించడం సిగ్గుచేటైన విషయమన్నారు. భవన నిర్మాణ కార్మికుల నిధులను రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా బొక్కేసి కార్మికుల కడుపు కొడుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటాలకి కార్మికలోకం సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాధా కృష్ణమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని రామారావు, కోశాధికారి కొండలరావు, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ రాజారెడ్డి, నాగసుబ్బారెడ్డి, మునెప్ప, పడాల రమణ, లలితమ్మ, రమేశ్ బాబు, సుబ్బరాయుడు, సోమసుందర్, శాంతి, స్రవంతి, శివయ్య గిరి, తదితరులు పాల్గొన్నారు.

సూడాన్ కమ్యూనిస్టు పార్టీపై దాడులు ఆక్షేపణీయం: సీపీఐ

న్యూదిల్లీ: సూడాన్‌లో ప్రజల పక్షాన పోరాడే ఆ దేశ కమ్యూనిస్టు పార్టీపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ప్రకటించింది. ర్యాపిడ్ సపోర్ట్ ఫోర్సెస్‌కు చెందిన సాయుధ మిలిటెంట్ సంఘాలు సూడాన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్రకార్యాలయంపై దాడులకు పాల్పడటమే కాకుండా దానిని స్వాధీనం చేసుకోవడాన్ని శనివారం ఒక ప్రకటనలో ఖండించింది. సూడాన్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కార్యాలయం ఇప్పుడు ర్యాపిడ్ సపోర్ట్ దళాల కేంద్రకార్యాలయంగా మారిందని పేర్కొంది. తక్షణమే కేంద్ర కార్యాలయాన్ని సూడాన్ కమ్యూనిస్టు పార్టీకి తిరిగిచ్చేయాలని డిమాండ్ చేసింది. 'విప్లవాల చరిత్రగల పార్టీ ఇది. సూడాన్‌లో నిరంకు శత్వాన్ని తిప్పికొట్టేందుకు ప్రజా ఉద్యమాలు నడిపించింది. ప్రజస్వామ్య సూడాన్ కోసం పోరాడింది. ఇలాంటి పార్టీ సంకల్పాన్ని బెదిరించలేరు. యుద్ధం అంతానికి, శాంతి నెలకొల్పేందుకు, ప్రజల ప్రజాస్వామిక హక్కుల కల్పనకు సూడాన్ కమ్యూనిస్టు పార్టీ చేసే పోరాటాన్ని ఆపలేవు' అని సీపీఐ స్పష్టంచేసింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి సూడాన్ ప్రజల పరిస్థితి దయనీయంగా మారిందని, హత్యలు, విధ్వంసకాండలు, ఇతరుల వ్యవస్థల స్వాధీనాలు కొనసాగుతున్నాయని, ర్యాపిడ్ సపోర్ట్ దళాల ఇష్టారాజ్యం సాగుతోందని, మానవహక్కులు పూర్తి స్థాయిలో ఉల్లంఘనకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తంచేసింది. సూడాన్ కమ్యూనిస్టు పార్టీకి, ఆ దేశ ప్రజలకు సంఘీభావాన్ని సీపీఐ ప్రకటించింది.

విద్య, వైద్య రంగాల్లో సమూల సంస్కరణలు

సి.రాఘవాచారి మీడియా అకాడమి కార్యక్రమంలో సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం మునుపెన్నడూ లేని విధంగా విద్య, వైద్య రంగాల్లో సమూల సంస్కరణలు చేపట్టిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యవహారాల ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. ఆ పథకాల ప్రయోజనం ఆయా వర్గాలకు అందేలా చూడడంలో క్షేత్ర స్థాయిలో జర్నలిస్టుల పాత్ర కీలక మైందన్నారు. ప్రతి వారం సి.రాఘవాచారి మీడియా అకాడమీ నిర్వహించే 'ఆన్ లైన్ అవగాహన కార్యక్రమం' లో భాగంగా శనివారం 'రాష్ట్రాభివృద్ధిలో మీడియా పాత్ర' అంశంపై ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. లబ్ధిదార్ల జీవితాల్లో గుణాత్మక మార్పు చోటు చేసుకునేలా ప్రేరణ కల్పించడం జర్నలిస్టుగా అత్యంత సంతృప్తికరమైన అంశంగా తాము భావిస్తున్నట్టు చెప్పారు. సమాజ హితం కోరి పని చేయడం, సమాజ గౌరవానికి, తద్వారా సమున్నత స్థానాన్ని పొందడానికి దోహద పడుతుందని ఆయన హితవు పలికారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న మార్పులు, సంస్కరణల ఫలితాలు, తక్కిన మరెవరికన్నా అక్కడ పని చేసే జర్నలిస్టులకు మాత్రమే కచ్చితంగా తెలుస్తాయన్నారు. ఇందుకు వారు స్వయంగా చూడడం, వినడం అవసరమన్నారు. ఇలా చేయడం వారు పని చేస్తోన్న మీడియా హౌస్ విధానాలకు భిన్నం కాదనే విషయాన్ని గుర్తించాలని ఆయన సూచించారు. జగన్‌మోహన్ రెడ్డి గత నాలుగేళ్లలో సమాజ మౌలిక అంశాలలో సంస్కరణలు చేపట్టడం జరిగిందన్నారు. వలంటీర్ వ్యవస్థ, గ్రామ, వార్డు సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా క్షేత్ర స్థాయిలో మెరుగైన 'డెలివరీ మెకానిజం' ఏర్పడిన సంగతిని ఆయన గుర్తు చేశారు. 'డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్' పద్ధతిలో నగదు ప్రయోజనాలు నేరుగా ప్రజలకు అందించడం ద్వారా అవినీతిని అరికట్టడానికి దోహదపడిందన్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం అర్హతకు ప్రామాణికంగా '6 సూత్రాల ఫార్ములా' రూపొందించినట్లు ఆయన తెలిపారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై పూర్తి శ్రద్ధ పెట్టి పనులు చేస్తోందని, ఈ ఫలితాలను క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించి తెలుసు కోవడం జర్నలిస్టుల కర్తవ్యమన్నారు. తొలుత ఉదయం 8 నుంచి 9 గంటల వరకు రచయిత, సీనియర్ జర్నలిస్టు గోవిందరాజు చక్రధర్ 'వార్తలు-విలువలు' అనే అంశంపై ప్రసంగించారు. సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ ఎల్.వి.కె.రెడ్డి, మీడియా అకాడమీ కంటెంట్ ఎడిటర్ కలమండ శరత్ బాబు, డిప్లొమా ఇన్ జర్నలిజం విద్యార్థులు, వర్కింగ్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

పార్లమెంటు కొత్త భవనం ప్రారంభం...

ఎంపీలను విశ్వాసంలోకి తీసుకోలేదు

ఎన్‌సీపీ అధ్యక్షుడు శరద్ పవార్

ముంబై : పార్లమెంటు నూతన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరిస్తూ ప్రతిపక్ష పార్టీల నిర్ణయాన్ని సమర్థిస్తూ, దానిపై ఎంపీలను విశ్వాసంలోకి తీసుకోలేదని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ నొక్కి చెప్పారు. అయితే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ షెడ్యూల్ ప్రకారం ఆదివారం (మే 28) పార్లమెంటు కొత్త భవనాన్ని ప్రారంభిస్తారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో భవనాన్ని ప్రారంభింపజేయాలని వాదిస్తున్న 20కి పైగా ప్రతిపక్ష పార్టీలు ఆ కార్యక్రమానికి హాజరుకాకూడదని నిర్ణయించాయి. పవార్ శనివారం పూణేలో విలేకరులతో మాట్లాడుతూ తాను అనేక సంవత్సరాల పార్లమెంటు సభ్యునిగా ఉన్నానని, పార్లమెంటు ప్రస్తుత భవనం వలసవాద కాలం నాటి నిర్మాణమని, అది మంచి స్థితిలో ఉందని చెప్పారు. పార్లమెంటు కొత్త భవనాన్ని నిర్మాణం చేస్తున్నట్లు వార్తా పత్రికలలో చదివానని పవార్ అన్నారు. 'ఇప్పుడు నిర్మాణం పూర్తయింది. (పార్లమెంటు) భవన ప్రారంభోత్సవంపై మమ్మల్ని సంప్రదించలేదు. నిబంధనల ప్రకారం, భారత రాష్ట్రపతి ప్రతి సంవత్సరం మొదటి సెషన్ (పార్లమెంటు)ను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అందువల్ల కొత్త భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలని స్పష్టంగా ఉంది. ఎవరినీ విశ్వాసంలోకి తీసుకోనందున, మేము దూరంగా ఉండాలని సీనియర్ ప్రతిపక్ష నాయకులు భావించారు. నేను దానిని అంగీకరిస్తున్నాను' అని తెలిపారు. రాష్ట్రపతి ముర్ము దేశాధినేత మాత్రమే కాదు. ఆమె సమావేశాలను ఏర్పాటు చేయడం, రద్దు చేయడం, ప్రసంగించడం పార్లమెంటులో అంతర్భాగమైనందున ఆమెను గౌరవించాలని ప్రతిపక్ష పార్టీలు వాదించాయి.

34 మంత్రులతో కర్నాటక కేబినెట్

- కొత్తగా 24 మందికి పదవులు
- వీరిలో ఒక్కరే మహిళ
- పూర్తైన మంత్రివర్గ విస్తరణ, శాఖల కేటాయింపు



బెంగళూరు: కర్నాటకలో మంత్రివర్గ విస్తరణ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వారంలోగా పూర్తి అయింది. మంజూరైన 34 స్థానాలు భర్తీ అయ్యాయి. 24 మంది కొత్తవారితో కలిపి 34 మందితో సిద్ధ కేబినెట్ శనివారం కొలువుదీరింది. ఈ మేరకు పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది. ఏకైక మహిళా మంత్రిగా లక్ష్మిహెబ్బాల్కర్ ఉన్నారు. ముగ్గురు మహిళా ఎమ్మెల్యేలు ఉన్నప్పటికి ఒకరికి మాత్రమే కేబినెట్ స్థానాన్ని పార్టీ కల్పించింది. 24 మంది కొత్త మంత్రులతో గవర్నర్ గెహ్లాట్ ప్రమాణ స్వీకారాలు చేయించారు. వీరిలో కాంగ్రెస్ అధిష్ఠానం సర్‌ప్రైజ్ అభ్యర్థి ఎన్ఎస్ బోస్‌రాజు ఒకరు. ఈయన ఎమ్మెల్యేగానీ ఎమ్మెల్సీగానీ కాదు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే.. రాయ్‌చూర్‌కు చెందిన బోస్‌రాజు నిబద్ధతగల కాంగ్రెస్ కార్యకర్త. బోస్‌రాజుకు కేబినెట్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం శుక్రవారం నిర్ణయించిందని పార్టీ నాయకుడు ఒకరు తెలిపారు. మంజూరైన మంత్రి పదవులన్నీ భర్తీ కావడం కర్నాటకలో అరుదని అన్నారు. 34 మందిలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో సహా పది మంది ఈనెల 20న ప్రమాణ స్వీకారం చేశారు. గట్టి భద్రత నడుమ రాజ్‌భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యేలు హెచ్‌కే పాటిల్, కృష్ణబైరెగౌడ, ఎన్.చెలువరస్వామి, కె.వెంకటేశ్, హెచ్‌సీ మహదేవప్ప, కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈశ్వర్ ఖండ్రే, పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు దినేశ్ గుండు రావు తదితరులూ ప్రమాణ స్వీకారాలు చేశారు. కేబినెట్ స్థానాన్ని ఆశించి భంగపడ్డ నాయకుల మద్దతుదారులంతా తమ నేతలకు పదవులను డిమాండ్ చేస్తూ ప్రమాణ స్వీకారం సమయంలో నిరసన తెలిపారు. ప్లకార్డులు ప్రదర్శించారు. అయితే ముఖ్యమంత్రి సిద్ధ... కులం, ప్రాంతం, వర్గం, సీనియర్లు, జూనియర్ల మధ్య సమతుల్యత చెడకుండా కేబినెట్‌ను నెలకొల్పినట్లు కాంగ్రెస్ ప్రకటన పేర్కొంది. కేబినెట్‌లో ఎనిమిది మంది లింగాయత్‌లు, డీకే శివకుమార్‌తో పాటు ఐదుగురు వక్కాలిగా వర్గీయులు, తొమ్మిది మంది ఎస్సీలు ఉన్నట్లు వెల్లడించింది. మంత్రులకు శాఖల కేటాయింపు కూడా పూర్తైంది. కాగా, మూడ్రోజులుగాలో దిల్లీలో అగ్రనేతలతో సిద్ధ, డీకే చర్చలు జరిపి 24 మంది పేర్లను ఖరారు చేసినట్లు పేర్కొంది. ఇదిలావుంటే, మంత్రిత్వ శాఖల కేటాయింపు పూర్తి కాగా ఆర్థిక, కేబినెట్ వ్యవహారాలు, ఇంటెలిజెన్స్ వంటి కీలక శాఖలు సీఎం సిద్ధరామయ్య వద్ద ఉండగా ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు బెంగళూరు నగర అభివృద్ధితో పాటు, నీటిపారుదల శాఖలను కేటాయించారు.

జూన్ 9న నారాయణమూర్తి యూనివర్సిటీ

హైదరాబాద్: స్నేహ చిత్ర పిక్చర్స్ బ్యానర్‌లో పీపుల్స్ స్టార్ ఆర్ నారాయణ మూర్తి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం యూనివర్సిటీ. ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. జూన్ 9న రెండు తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నారాయణ మూర్తి మాట్లాడుతూ 10వ తరగతిలో పేపరు లీకేజీలు - గ్రూపు 1-2 లాంటి ఉద్యోగ పరీక్షల్లోనూ పేపరు లీకేజీలు ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? లంబకోణాలు నేర్పిన వాళ్ళే కుంభకోణాలు జేస్తూ ఉంటుంటే రెక్కలు తెగిన జ్ఞాన పావురాలు విలవిల కొట్టుకుంటూ ఊపిరాడక గింజుకుంటుంటే ఈ విద్యావ్యవస్థ, ఈ ఉద్యోగవ్యవస్థ నిర్వీర్యం కావాలా? కాకూడదు. మనది నిరుద్యోగ భారతం కాదు. ఉద్యోగ భారతం కావాలి అని చాటి చెప్పే చిత్రమే ఈ "యూనివర్సిటీ" రెండు తెలుగు రాష్ట్రాల్లో జూన్ 9న రిలీజ్ అవుతోంది అన్నారు. ఈ చిత్రానికి పాటలు గద్దర్, నిస్సార్, మోటపలుకులు రమేష్, వేల్పుల నారాయణ., గాయకులు గద్దర్, జల్దంకి సుధాకర్, సాయిచరణ్, గోస్కుల రమేష్, పల్లె నరసింహం. కథ-స్క్రీన్ ప్లే- మాటలు- సంగీతం - దర్శకత్వం-నిర్మాత ఆర్.నారాయణ మూర్తి.

నాకు పెళ్లి వయసు దాటిపోయింది: సల్మాన్‌ఖాన్

ముంబై: బాలీవుడ్ స్టార్‌హీరో సల్మాన్‌ఖాన్ ఎప్పుడెప్పుడు పెళ్లి చేసుకుంటారా? అని ఆయన అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఆయన పెళ్లి గురించి స్పందించారు. తనకు పెళ్లి చేసుకునే వయసు దాటిపోయిందన్నారు. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డులు (ఐఫా) - 2023కు సంబంధించి మీడియా సమావేశం దుబాయ్‌లో జరిగింది. బీటౌన్ నుంచి సల్మాన్‌ఖాన్, అభిషేక్ బచ్చన్, రకుల్ ప్రీత్ సింగ్, నోరా ఫతేహి, విక్కీ కౌశల్ తదితరులు మీడియాతో సరదాగా ముచ్చటించారు. ఈ క్రమంలోనే ఓ మహిళా అభిమాని సల్మాన్‌కు ప్రపోజ్ చేసింది. 'సల్మాన్ మిమ్మల్ని చూసినప్పుడే నేను మీతో ప్రేమలో పడిపోయాను. ఈ విషయం మీతో చెప్పడం కోసం హాలీవుడ్ నుంచి ఇక్కడికి వచ్చాను' అంటూ ఆమె తన ఇష్టాన్ని తెలపగా.. 'మీరు షారుక్ ఖాన్ గురించి మాట్లాడుతున్నారు కదా!' అని సల్లూబాయ్ జోక్స్ వేశారు. అనంతరం ఆమె..'లేదు. నేను మిమ్మల్నే ప్రేమిస్తున్నాను. మీరు నన్ను పెళ్లి చేసుకుంటారా?' అంటూ తన మనసులో మాట బయటపెట్టింది. దీనిపై స్పందించిన సల్మాన్... 'నాకు పెళ్లి వయసు దాటిపోయింది. 20 ఏళ్ల క్రితం నువ్వు నన్ను కలిసి ఉంటే బాగుండేది' అని సరదాగా బదులిచ్చారు. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.

ఐఫాలో సత్తాచాటిన గంగూబాయి కఠియావాడి

ముంబై: ఏడాది క్రితం వచ్చిన గంగూబాయి కఠియావాడి ఇండియన్ బాక్సాఫీస్‌పై తీవ్ర సంచలనమే సృష్టించింది. సంజయ్‌లీలా భన్సాలీ విజన్‌కు, ఆలియాభట్ నటనకు ప్రేక్షకులు వెర్రెత్తిపోయారు. కలెక్షన్‌లే కాదు అవార్డులు సైతం గంగూబాయికి దాసోహం అయ్యాయి. నెల రోజుల కిందట జరిగిన 68వ ఫిలింఫేర్ అవార్డుల కార్యక్రమంలో ఏకంగా పది అవార్డులను సొంతం చేసుకుని చరిత్ర సృష్టించింది. ఇక ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమా ఐఫా అవార్డుల్లో మరోసారి సత్తా చాటింది. ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ అవార్డ్స్-2023 వేడుక యూఏఈ రాజధాని అబుదాబిలో ఘనంగా ప్రారంభమైంది. కాగా ఈ అవార్డు ఫంక్షన్‌లో గంగూబాయి సినిమాకు మూడు అవార్డులు వరించాయి. బెస్ట్ స్క్రీన్‌ప్లే విభాగంలో సంజయ్ లీలా భన్సాలీ, ఉత్కర్శిని వశిష్ఠ అవార్డును గెలుచుకున్నారు. ఇక బెస్ట్ సినిమాటోగ్రాఫర్‌గా సుదీప్ ఛటర్జీ అవార్డు అందుకున్నాడు. ప్రకాష్ కపాడియా-ఉత్కర్శిని వశిష్ఠ బెస్ట్ డైలాగ్ విభాగంలో అవార్డు అందుకున్నారు. ఇలా మూడు విభాగాల్లో గంగూబాయి అవార్డులు కైవలం చేసుకుంది.

పార్లమెంటు కొత్త భవనం వద్దే నిరసన

- నేడు శాంతియుత 'మహిళా సమ్మాన్ పంచాయత్'
- మహిళలు ఎదుర్కొంటున్న అన్యాయాలపై మాట్లాడటం మా లక్ష్యం: సాక్షి మాలిక్

న్యూదిల్లీ: శాంతియుత 'మహిళా సమ్మాన్ పంచాయత్' కోసం రెజ్లర్లు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఆదివారం పార్లమెంటు కొత్త భవన సముదాయం వరకు వారు తమ మద్దతు దారులతో కలిసి ప్రదర్శన నిర్వహించనున్నారు. మైనర్‌తో సహా యువ క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై తక్షణమే చర్యలు చేపట్టాలని రెజ్లర్లు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గత కొన్ని రోజులుగా దిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన కొనసాగిస్తున్నారు. ఇప్పుడు వారు తమ నిరసనను మరింత ఉధృతం చేశారు. మే 27వ తేదీ తెల్లవారుజామున దిల్లీని ముంచెత్తిన ఉరుములతో కూడిన వర్షం దాని నివాసితులకు వేడి నుంచి ఉపశమనం కలిగించి ఉండవచ్చు. అయితే ఇది గత 34 రోజులుగా జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న మల్లయోధుల జీవితాన్ని మరింత కష్టతరం చేసింది. గాలి, వర్షం వల్ల చాలా మంది తమ మద్దతుదారులు రాత్రిపూట నిద్రిస్తున్న షామియానా పడిపోయింది. దీంతో సాక్షి మాలిక్, సంగీతా ఫోగట్‌లు దాదాపు గాయపడ్డారు. 'గాలి చాలా విపరీతంగా ఉంది. అది నిజానికి మేము పక్కనే నిద్రిస్తున్న భారీ షామియానా కూలిపోయింది. కానీ బజరంగ్ (పునియా) మమ్మల్ని రక్షించాడు' అని మాలిక్ తెలిపారు. కొంత దూరంలో నిద్రిస్తున్న పునియా, షామియానా కూలిపోవడం చూసి నిద్రిస్తున్న మల్లయోధులపై పడక ముందే దానిని పట్టుకున్నాడు. దీంతో నిరసన స్థలం గందరగోళంగా మారింది. వలంటీర్లు అక్కడ వర్షం నీటిని ఊడ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. తడిచిన పరుపులు, తివాచీలను ఆరబెట్టడానికి, పడిపోయిన షామియానాను మళ్లీ నిలబెట్టే చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో ఒక్కసారిగా కలకలం చెలరేగింది. ఇదే సమయంలో ఏబీపీ విలేకరి తన కెమెరామెన్‌తో నిరసన శిబిరం వద్దకు చేరుకొని అక్కడి పరిస్థితిని చిత్రీకరించేందుకు ప్రయత్నించారు. దీనిపై నిరసన శిబిరాన్ని నిర్వహిస్తున్న హరియాణాకు చెందిన చర్కీ దాద్రీ నుంచి వచ్చిన మనోజ్ ఆర్య ఆగ్రహం వ్యక్తం చేస్తూ, 'మమ్మల్ని వెక్కిరించడానికి ఇక్కడికి వచ్చారా? అని నిలదీశారు. 'మే 23న ఇక్కడి నుంచి ఇండియా గేట్ వరకు క్యాండిల్ మార్చ్ నిర్వహించాం. ఆ రోజు కనీసం 15,000 మంది కవాతు చేశారు. మీ ఏబీపీ విలేకరులు కూడా ఉన్నారు. కానీ మీరు మీ ఛానెల్‌లో ప్రదర్శనను మాకు మద్దతుగా వచ్చిన భారీ సంఖ్యలో ప్రజలను ఎందుకు చూపించలేదు? సరిగ్గా మా ప్రదర్శన జరుగుతున్న సమయంలో మీరు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ అర్థం లేని మాటలను ప్రత్యక్ష ప్రసారాన్ని చూపించారు' అని ధ్వజమెత్తారు. అయితే ఈ సందర్భంగా నిరసనకారులు ఎటువంటి అభ్యంతరకరమైన భాష ఉపయోగించలేదు. బీజేపీ ఎంపీ, భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్... మైనర్‌తో సహా అనేక మంది యువ క్రీడాకారిణులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అతనిపై కేసు నమోదు చేసినప్పటికీ, ఇంకా ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కాగా, నిరసన ప్రారంభమైనప్పటి నుంచి ఉన్న రాజస్థాన్‌కు చెందిన మద్దతుదారుడు వికాస్ జాఖర్ మాట్లాడుతూ 'ఏబీపీ విలేకరులు వస్తారు, వారు మమ్మల్ని ఇంటర్వ్యూ చేస్తారు. వారి ఛానెల్‌లో మా గురించి ఏమీ చూపించరు! మే 23వ తేదీ సాయంత్రం మూడు లేదా నాలుగు గంటల పాటు మా కొవ్వొత్తుల ప్రదర్శన ఇండియా గేట్ వరకు జరిగింది. కానీ వారు తమ ఛానెల్‌లో బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను మాత్రమే చూపించారు. అర్ధరాత్రి, దాదాపు 12:30 గంటలకు, చాలా మంది ప్రజలు నిద్రలో ఉన్నప్పుడు వారు మా ప్రదర్శనను కొంచెం చూపించారు. అయితే, మరుసటి రోజు ఉదయం, అందరూ నిద్రలేచి టీవీ చూసే సమయానికి, బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ మాటలను మళ్లీ ప్రసారం చేశారు. దీని అర్థం ఏమిటి?' అని ప్రశ్నించారు. ఈ సమయంలో బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు ధరించి, మెషిన్ గన్లు, టియర్ గ్యాస్ క్యానిస్టర్లను మోసుకువెళ్లే సీఆర్‌పీఎఫ్ జవాన్ల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. మళ్లీ జంతర్ మంతర్ కంటోన్మెంట్ జోన్‌ను తలపిస్తోంది. అయితే శనివారం యోగా గురువు బాబా రామ్‌దేవ్... బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని పిలుపునిచ్చినందున, రెజ్లర్‌లకు మద్దతు లభించింది. 'దేశంలోని రెజ్లర్లు జంతర్ మంతర్ వద్ద కూర్చుని రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిపై లైంగిక దుష్ప్రవర్తన ఆరోపణలు చేయడం చాలా సిగ్గుచేటు అని ఆయన అన్నారు. అలాంటి వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కటకటాల వెనక్కి పంపాలి' అని పేర్కొన్నారు. మే 28 ఆదివారం మీ ప్రణాళిక ఏమిటని సాక్షి మాలిక్‌ను ప్రశ్నించగా, పార్లమెంటు కొత్త భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించనున్న రోజు ఇది ఇప్పుడు వివాదాలకు పెద్దపీట వేస్తోంది. ఆమె సమాధానం సూటి చెబుతూ, పార్లమెంటు కొత్త భవనం ముందు జరిగే మా 'మహిళా సమ్మాన్ పంచాయత్' లో పాల్గొనడానికి ఆదివారం దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి మా మద్దతు దారులు చాలా మంది వస్తున్నారు అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.